మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి
# ఈవార్తలు
దినపత్రిక
NETI EVARTHALU

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 19-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 170 Issue: 170

Published from Jagitial
www.evarthalu.com

పంచాంగం వివరాలు తెలుసుకోండి. 19 డిసెంబర్ 2025 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:44 సూర్యాస్తమయం - సా. 5:42 తిథిః అమావాస్య ఉ. 7:12ం వరకు సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం జ్యేష్ఠ రా. 10:42 వరకు తరువాత మూల యోగం శూల మ. 3:41 వరకు కరణం చతుష్పాద సా. 6:06 వరకు నాగవ ఉ. 7:12ం వరకు వర్జ్యం మ. 12:35 నుండి మ. 1:18 వరకు దుర్ముహూర్తం ఉ. 8:56 నుండి ఉ. 9:39 వరకు రాహుకాలం ఉ. 10:51 నుండి మ. 12:13 వరకు యమగండం మ. 2:57 నుండి సా. 4:19 వరకు గుళికాకాలం ఉ. 8:06 నుండి ఉ. 9:28 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:08 నుండి తె. 5:56 వరకు అమృత ఘడియలు మ. 1:01 నుండి మ. 2:48 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:51 నుండి మ. 12:35 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున




# జయహో భారత్!
## రోల్ బాల్ వరల్డ్ కప్‌లు మనవే
### విజేతలుగా పురుష, మహిళల జట్లు

రోల్ బాల్ వరల్డ్ కప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు విజేతగా నిలిచాయి. దుబాయ్ వేదికగా ‵రిగిన ఈ టోర్నీ ఫైనల్లో భారత పురుషుల జట్టు 11-10 తేడాతో, మహిళల జట్టు 3-2 తేడాతో కెన్యా పురుషుల, మహిళల జట్లను ఓడించాయి. ఈ గెలుపుతో ప్రపంచకప్ టైటిల్స్‌ను ముద్దాడాయి. ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కెన్యా భారత పురుషుల జట్టుకు గట్టి పోటీనిచ్చింది. ఒక దశలో భారత్ వెనుకంజలో నిలిచినప్పటికీ.. పుంజుకుని ఈ విజయాన్ని కైవసం చేసుకుంది.

భారత పురుషుల జట్టుకు 5వ ప్రపంచకప్ టైటిల్. మహిళలకు మూడో ప్రపంచకప్ టైటిల్. ఈ మెగా ఈవెంట్‌లో భారత్, కెన్యా, పోలాండ్, అర్జెంటీనా, సౌదీ అరేబియా, పాకిస్థాన్ వంటి దేశాలు పాల్గొన్నాయి. 2023లో పూణేలో జరిగిన ప్రపంచకప్‌లో కెన్యా చేతిలో ఎదురైన ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ఈసారి దుబాయ్ గడ్డపై భారత్ రెండు విభాగాల్లోనూ క్లీన్ స్వీప్ చేసింది. భారత మూలాలున్న ఈ క్రీడలో మన జట్లు ప్రపంచ స్థాయి ఆధిపత్యాన్ని చెలాయించాయి. భారత పురుషుల జట్టు విజయంలో రోహన్ దాభాడే, హితేష్ సింగ్, యష్ రాశియా, హర్షల్ ఘుగే కీలక పాత్ర పోషించాడు. రోలా బాల్ తరువాయి 2 వ పేజీలో...

## గ్రూప్-3 ఫలితాలు విడుదల
### 1370 మంది అభ్యర్థుల ఎంపిక
### అధికారిక వెబ్‌సైట్‌లో రిజల్ట్స్

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఈవార్తలు): తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుభవార్త చెప్పింది. గ్రూప్-3 సర్వీసులకు సంబంధించి ప్రొవిజనల్ ఎంపిక జాబితాను గురువారం విడుదల చేసింది. మొత్తం 1,388 పోస్టులకు గాను 1,370 మంది అభ్యర్థులను తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,484 |
| వెండి (గ్రాము): | రూ.224 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,688 |

## విశ్వవాణి



ఏ పనీ చేయకుండానే సంవత్సరానికి రూ.72 లక్షలు సంపాదించాడో యువకుడు. అదెలా సాధ్యం అనుకుంటున్నారా? జపాన్‌కు చెందిన షోజీ మొరిమోటో ఏ పని చేయడం లేదని ఓ కంపెనీ 2018లో ఉద్యోగంలోంచి తీసేసిందట. దీంతో ఏ పని చేయకుండానే సంపాదించడం ఎలా? అని ఆలోచించి, తనను తాను అద్దెకి ఇచ్చుకోవడం ప్రారంభించాడు. అద్దెకు తీసుకున్నవాళ్లకు షోజీ ఏ పనీ చేయడు. కేవలం అక్కడ హాజరవుతాడు. అలా.. ఒంటరిగా ఉన్నవారికి తోడుగా, ఇంట్లో ఖాళీగా ఉండేవాళ్లకు కాలక్షేపంగా మారిపోయాడు. అలా అని తాను భావోద్వేగాలను పంచుకోడు. వాళ్లకు అందుబాటులో మాత్రమే ఉంటాడు.

వీబీ జీ రామ్ జీ పథకం
# హే.. జీ.. రామ్!
### ఎంజీ నరేగా పేరు మార్పు.. బిల్లుకు లోక్‌సభ ఆమోదముద్ర



వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్ (వీ బీ జీ రామ్ జీ) బిల్లుకు లోక్‌సభలో ఆమోదముద్ర పడింది. భారత్‌లో 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దాన్ని రద్దు చేసి వీ బీ జీ రామ్ జీని ఎన్డీఏ సర్కారు అమలు చేయనుంది. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏను గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కోసం తీసుకొచ్చారు. ఇదే లక్ష్యంతో వీ బీ జీ రామ్ జీని తీసుకొస్తున్నారు. ఈ కొత్త పథకానికి సంబంధించిన బిల్లును గురువారం లోక్‌సభలో ఆమోదించే వేళ విపక్ష సభ్యులు గందరగోళం సృష్టించారు. నిరసనల మధ్యే ఈ బిల్లుకు ఆమోదముద్ర పడింది.

న్యూఢిల్లీ: లోక్‌సభలో తరుచూ గందరగోళం నెలకొంటుండడంతో సభను శుక్రవారానికి వాయిదా వేశారు. బిల్లుపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. ఈ చట్టం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపాధిని కల్పిస్తుందని, గ్రామాలు స్వయం సమృద్ధి సాధించాలన్న మహాత్మా గాంధీ కలను సాకారం చేస్తుందని అన్నారు. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) బిల్లు గ్రామాల సమగ్ర అభివృద్ధిని తరువాయి 2 వ పేజీలో...



# జంపింగ్‌ల అ‘టెన్షన్’
### స్పీకర్ కాదన్నా సుప్రీం చెప్పేదేంటి?
### నేడు విచారణకు ఫిరాయింపుల పిటిషన్
### కోల్‌కతా హైకోర్టు తీర్పుతో ముచ్చెమటలు
### సుప్రీం రిజిస్ట్రీలో కోల్‌కతా కేసు వివరాలు!



హైదరాబాద్/న్యూఢిల్లీ, డిసెంబర్ 18 (ఈవార్తలు): బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన పది మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ దయ చూపారు. వారు పార్టీ మారారని సాక్ష్యాలు లేవని పిటిషన్లు తిరస్కరించారు. మరో నలుగురి పిటిషన్లు కూడా ఇలాగే తిరస్కరించే అవకాశం ఉంది. ఒక్క దానం నాగేందర్ విషయంలో మాత్రం ఏం చేస్తారన్నది సస్పెన్స్‌గా ఉంది. అయితే మరి ఈ పది మంది ఎమ్మెల్యే ఇంతటితో గండం తరువాయి 2 వ పేజీలో...

# కడుపులో విషం
### ప్రతిపక్షంలో ఉన్నా అహంకారం తగ్గలేదు
### 2028లోనూ గెలిచేది కాంగ్రెస్ పార్టీనే.. ఏ ఎన్నికైనా ప్రజలు అండగా ఉంటున్నరు
### పంచాయతీలో అద్భుత ఫలితాలు సాధించాం.. మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి చిట్‌చాట్



ప్రతిపక్షంలో ఉన్నవారికి అధికారం కోల్పోయినా అహంకారం తగ్గలేదంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఇంకొకాయన కడుపు నిండా విషం పెట్టుకుని మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. మూసీలోని కాలుష్యం కంటే వీళ్ల కడుపులోనే ఎక్కువ విషం ఉందని ఇకనైనా ఇప్పటికైనా అహంకారం, అసూయ తగ్గించుకోవాలని ప్రతిపక్షాలకు సీఎం సూచించారు.

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఈవార్తలు): ప్రజాతీర్పును గౌరవించి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు సహకరించాలని...బరితెగించి వ్యవహరిస్తామంటే ప్రజలు గమనిస్తున్నారని చెప్పుకొచ్చారు. 2028లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం తరువాయి 2 వ పేజీలో...

# 11.25 లక్షలకే 1 బీహెచ్‌కే
### ఖమ్మం, హైదరాబాద్, వరంగల్‌లో అందుబాటులో
### అల్పాదాయ వర్గాల కోసం సిద్ధంగా 339 ఫ్లాట్లు
### తెలంగాణ గృహనిర్మాణ మండలి సదవకాశం
### లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు వెల్లడి
### వివరాలకు వెబ్‌సైట్ https://tghb.cgg.gov.in



హైదరాబాద్, డిసెంబర్ 18 (ఈవార్తలు): తెలంగాణ గృహనిర్మాణ మండలి అల్పాదాయ వర్గాల కోసం హైదరాబాద్, ఖమ్మం, వరంగల్‌లో 339 ఫ్లాట్లను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా ఖమ్మం శ్రీరామ్ హిల్స్ ప్రాంతంలో కేవలం రూ. 11.25 లక్షలకే ఫ్లాట్ పొందే సువర్ణావకాశం కల్పించింది. వార్షిక ఆదాయం రూ. 6 లక్షల లోపు ఉన్నవారు ఈ ఫ్లాట్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. గచ్చిబౌలిలో రూ. 26 లక్షల నుండి.. వరంగల్‌లో రూ. 19 లక్షల నుండి ధరలు ప్రారంభమవుతున్నాయి. ఆసక్తి గల వారు ఆన్‌లైన్ లేదా మీసేవ ద్వారా తరువాయి 2 వ పేజీలో...

# బీఆర్ఎస్‌కు వెయ్యేనుగుల బలం
### సర్పంచ్ ఎన్నికలతో కారుకు పూర్వవైభవం
### కాంగ్రెస్ వల్లే రాష్ట్రంలో రాజకీయం గలీజ్: కేటీఆర్



భువనగిరి, డిసెంబర్ 18 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం ప్రారంభమైందని, భవిష్యత్తులో సాధించబోయే అఖండ విజయాలకు యాదాద్రి భువనగిరి జిల్లా గడ్డ పునాది వేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తరువాయి 2 వ పేజీలో...

# నా చేతిలో గులాబీ జెండా..
### కేసీఆరే గుండె నిండా!
### నీ చీప్ ట్రిక్కులకు ఎవడు పడిపోడు
### సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ కౌంటర్‌ఖీఖీ



హైదరాబాద్, డిసెంబర్ 18 (ఈవార్తలు): ‘నాకు, కేటీఆర్‌కు మధ్య మిత్ర బేధం సృష్టించాలని, తద్వారా బీఆర్ఎస్‌ను బలహీనపరచాలని సీఎం రేవంత్ రెడ్డి ఒక చీప్ ట్రిక్ ప్లే చేస్తున్నాడు’ అని మాజీమంత్రి హరీశ్ తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

19.12.2025

మేషం: వ్యాపారాల్లో ఆశించిన ఫలితాలు సాధిస్తారు. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు అమలుపరుస్తారు. అవసరానికి సన్నిహితుల నుండి ధన సహాయం అందుతుంది. రాజకీయ ప్రముఖుల నుండి అందిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తాయి.

వృషభం: వృత్తి ఉద్యోగస్తులకు పని ఒత్తిడి అధికమవుతుంది. వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు చేయటం మంచిది కాదు. కుటుంబ సభ్యులు మీ మాటతో విభేదిస్తారు. చేపట్టిన పనులు శ్రమాధిక్యతతో కానీ పూర్తి కావు ఆర్థికంగా కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది.

మిధునం: బంధుమిత్రులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాల్లో ఆలోచించి ముందుకు సాగడం మంచిది ఉద్యోగస్తులకు అధికారులతో చర్చలు ఫలించవు. దూర ప్రయాణాలు వాయిదా వేయటం మంచిది నూతన వ్యాపారాలు ప్రారంభానికి చేసే ప్రయత్నాలు విఫలమవుతాయి

కర్కాటకం: విద్యార్థుల కష్టానికి తగిన ఫలితం పొందుతారు. జీవిత భాగస్వామి సహాయంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు వృత్తి వ్యాపారాల్లో ఆశించిన లాభాలు అందుతాయి సమాజంలో గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. చిన్ననాటి మిత్రుల నుండి విలువైన వస్తువులు బహుమతులుగా పొందుతారు.

సింహం: మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. నూతన వ్యక్తుల పరిచయాలు ఉత్సాహనిస్తాయి.చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది.

కన్య: నిరుద్యోగ ప్రయత్నాలు వాయిదా పడుతాయి . వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది.ఇతరులతో వివాదాలకు వీలైనంత దూరంగా ఉండటం మంచిది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం అవసరానికి చేతిలో డబ్బు నిల్వ ఉండదు. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి వృత్తి వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుకుంటారు.

తుల: ఉద్యోగ విషయమై అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. మాతృ వర్గ బంధువులతో వివాదాలు కలుగుతాయి దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. .ఆదాయ మార్గాలు మందగిస్తాయి.ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు. పాత మిత్రుల నుండి అందిన సమాచారం ఊరట కలిగిస్తుంది.

వృశ్చికం: గృహమున శుభకార్య విషయమై ప్రస్తావన వస్తుంది. దీర్ఘకాలిక ఋణ సమస్యల నుండి కొంత వరకు బయటపడతారు. వృత్తి ఉద్యోగాలలో మీ పనితీరుతో అందరినీ ఆకట్టుకుంటారు. ఆప్తుల నుండి శుభవార్తలు అందుతాయి. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. బంధుమిత్రులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.

ధనస్సు: వ్యాపార విస్తరణకు ప్రయత్నాలు ఫలించవు. జీవిత భాగస్వామితో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. ఉద్యోగస్థులకు అదనపు పని భారం వలన తగిన విశ్రాంతి లభించదు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులలో ప్రతిబంధకాలు తప్పవు. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు.

మకరం: నూతన వ్యాపారాలు ప్రారంభించిన తగిన లాభాలు అందుకుంటారు. ధనదాయ మార్గాలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలు అనుకూలిస్తాయి. నిరుద్యోగులకు అరుదైన అవకాశాలు అందుతాయి. సన్నిహితులతో గృహమున సంతోషంగా గడుపుతారు. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది.

కుంభం: ఉద్యోగమున సహోద్యోగుల నుండి విమర్శలు అధికమవుతాయి. నేత్ర అనారోగ్య సమస్యలు బాధిస్తాయి నూతన ఋణ ప్రయత్నాలు ఫలించవు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఊహించని మార్పులు చోటు చేసుకుంటాయి. ఆకస్మిక ప్రయాణాలు చేయవలసి వస్తుంది. దూరపు బంధువులతో మాటపట్టింపులు ఉంటాయి.

మీనం: స్థిరాస్తి క్రయ విక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. సంతాన వివాహ విషయమై గృహమున చర్చలు చేస్తారు. విలువైన వస్తు వాహనాలు బహుమతులుగా పొందుతారు ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. నూతన వస్తులాభాలు అందుకుంటారు. నిరుద్యోగుల కలలు ఫలిస్తాయి.

# జంపింగ్‌ల అ'టెన్షన్'

మొదటి పేజీ తరువాయి

గట్టెక్కలేదు. ఎందుకంటే బీఆర్ఎస్ న్యాయపోరాటానికి రెడీ అయింది. ప్రస్తుతం స్పీకర్ అనర్హతా పిటిషన్ ను తోసి పుచ్చినందుకు బీఆర్ఎస్ ఈ విషయంలో వెనక్కి తగ్గకుండా సుప్రీంకోర్టు వరకు వెళ్లే యోచనలో ఉంది. కోల్‌కతా హైకోర్టు తీర్పును ఉదహరిస్తూ తెలంగాణలోనూ అదే తరహా తీర్పు రావాలని కోరవచ్చు. ఒకవేళ కోర్టు అనర్హత వేటు వేస్తే, ఆయా నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు అనివార్యం అవుతాయి. ఇది రాష్ట్ర రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేయగలదు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం ప్రజాస్వామ్య విరుద్ధమనే వాదనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని బీఆర్ఎస్ భావిస్తోంది. కోల్‌కతా హైకోర్టు తీర్పును ఉదాహరణగా చూపిస్తూ, ఫిరాయించిన ఎమ్మెల్యేలు రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వాదించే అవకాశం ఉంది. స్పీకర్ నిర్ణయాన్ని కొట్టివేసి అనర్హతా వేటు వేయాలని బీఆర్ఎస్ పోరాడనుంది. అలాంటి వాదనుల జరిగితే ఫిరాయించిన ఎమ్మెల్యేల సభ్యత్వం ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

### కోల్‌కతా హైకోర్టు ఏం చెప్పిందంటే..

ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ నుంచి తృణమూల్ కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఒక ఎమ్మెల్యే విషయంలో కోల్‌కతా హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. స్పీకర్ ఆ ఎమ్మెల్యేపై అనర్హత పిటిషన్‌ను తిరస్కరించారు. కానీ ఆ నిర్ణయాన్ని తప్పుబడుతూ, సదరు ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం 10వ షెడ్యూల్ స్ఫూర్తిని కాపాడటంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చని ఈ తీర్పు స్పష్టం చేసింది. రాజకీయ ప్రయోజనాల కోసం స్పీకర్లు నిర్ణయాలను కాలయాపన చేయడం లేదా ఏకపక్షంగా తిరస్కరించడం చెల్లదని ఈ తీర్పు ద్వారా వెల్లడైంది.

తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన దాదాపు 10 మంది ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారన్న విషయం అందిరకీ తెలుసు. కానీ వారు పార్టీ మారలేదని చెప్పి కవర్ చేసుకున్నారు. నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఒత్తిడి ఉంది కాబట్టి తీసుకున్నారు. ప్రస్తుతానికి ఐదుగురిపై నిర్ణయం ప్రకటించినా మొత్తం 9 మందిని పార్టీ మారలేదని చెప్పి స్పీకర్ కాపాడుతారు. కానీ దానం నాగేందర్ విషయంలో మాత్రం సాధ్యం కాదు. ఆయన కాంగ్రెస్ తరపున ఎన్నికల్లో పోటీ చేశారు కూడా. ఆయన విషయంలో కాలయాపన చేయాలి లేదా రాజీనామా చేయించాలి. బీఆర్ఎస్ పార్టీకి ఇప్పుడు కోల్‌కతా హైకోర్టు తీర్పు ధైర్యాన్ని ఇస్తోంది. ఇది తెలంగాణలోని ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హెచ్చరిక లాంటిదే. స్పీకర్ అధికారాలకు న్యాయ సమీక్షా అధికారం అతీతం కాదని ఈ తీర్పులు నిరూపిస్తున్నాయి. అందుకే బీఆర్ఎస్ ధైర్యంగా ఉంది. న్యాయపోరాటానికి రెడీ అవుతోంది.

## 11.25 లక్షలకే 1 బీహెచ్‌కే

మొదటి పేజీ తరువాయి

దరఖాస్తు చేసుకోవాలి. జనవరి 6 నుండి 10వ తేదీ వరకు లాటరీ పద్ధతిలో ఈ ఫ్లాట్లను కేటాయిస్తారు. తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ బోర్డు సామాన్యుల సొంత ఇంటి కలను నిజం చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా ఖమ్మం పట్టణంలో కేవలం రూ. 11.25 లక్షలకే ఒక అద్భుతమైన ఫ్లాట్‌ను సొంతం చేసుకునే అవకాశాన్ని అల్పాదాయ వర్గాలకు కల్పించింది. ప్రైవేటు రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ధరలు ఆకాశాన్ని తాకుతున్న వేళ.. ప్రభుత్వం ఇంత తక్కువ ధరకే నివాస యోగ్యమైన ఫ్లాట్లను ప్రకటించడం మధ్యతరగతి ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తోంది. ఖమ్మం నగరంలోని అత్యంత డిమాండ్ ఉన్న శ్రీరామ్ హిల్స్ ప్రాంతంలో మొత్తం 126 ఫ్లాట్లు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక్కడ ధరలు రూ. 11.25 లక్షల నుండి ప్రారంభమై రూ. 19 లక్షల వరకు మాత్రమే ఉండటం విశేషం. బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే ఇది సగం కంటే తక్కువ ధర కావడం గమనార్హం. కేవలం ఖమ్మమే కాకుండా.. హైదరాబాద్ , వరంగల్ నగరాల్లో కూడా హౌసింగ్ బోర్డు ఫ్లాట్లను అందుబాటులోకి తెచ్చింది. ఐటీ హబ్ సమీపంలోని గచ్చిబౌలిలో 111 ఫ్లాట్లు ఉన్నాయి. వీటి ధర రూ. 26 లక్షల నుండి రూ. 36.20 లక్షల వరకు ఉంది. రైల్వే స్టేషన్ సమీపంలోని అపార్ట్‌మెంట్లలో 102 ఫ్లాట్లు ఉండగా.. వీటి ధర రూ. 19 లక్షల నుండి రూ. 21.50 లక్షల వరకు నిర్ణయించారు. అంటే దరఖాస్తుదారుని వార్షిక ఆదాయం రూ. 6 లక్షల లోపు ఉండాలి. ఈ ఇల్లు 450 చదరపు అడుగుల నుండి 650 చదరపు అడుగుల వైశాల్యం కలిగి ఉంటాయి. దరఖాస్తు చేసుకున్న వారిలో అత్యంత పారదర్శకంగా లాటరీ పద్ధతిలో విజేతలను ఎంపిక చేస్తారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్ ద్వారా లేదా మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వీపీ గౌతం తెలిపిన వివరాల ప్రకారం.. లాటరీ ప్రక్రియ అనేది జనవరలో జరుగుతుంది. అంటే.. జనవరి 6న గచ్చిబౌలి ఫ్లాట్ల లాటరీ, జనవరి 8న వరంగల్ ఫ్లాట్ల కేటాయింపు, జనవరి 10న ఖమ్మం శ్రీరామ్ హిల్స్ ఫ్లాట్ల లాటరీ తీస్తారు. సాధారణంగా గృహనిర్మాణ మండలి(హౌసింగ్ బోర్డు) నిర్మించే ఇళ్ళు నాణ్యతతో కూడి ఉంటాయి. ఇప్పుడు విక్రయిస్తున్నవి 'ఎక్కడ ఉన్నవి అలానే' అన్న ప్రాతిపదికన విక్రయిస్తున్నప్పటికీ.. ఇవి ఇప్పటికే అభివృద్ధి చెందిన గేటెడ్ కమ్యూనిటీలలో ఉండటం లబ్ధిదారులకు అదనపు ప్రయోజనం. విద్యుత్, తాగునీరు, రవాణా సౌకర్యాలు పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లో ఇవి ఉండటంతో భవిష్యత్తులో వీటి విలువ మరింత పెరిగే అవకాశం ఉంది. మరిన్ని వివరాల కోసం హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌ను https://tghb.cgg.gov.in/ సందర్శించవచ్చు.

## నా చేతిలో గులాబీ జెండా..

మొదటి పేజీ తరువాయి

ఆరోపించారు.కేటీఆర్ వెనకాల తాను గోతులు తవ్వుతున్నానంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.'పంచాయతీ ఎన్నికల ఫలితాలు చూసిన రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్ పీక్స్‌కు చేరింది. రోజురోజుకీ పరిస్థితులు చేజారి పోతున్నాయనే సత్యం జీర్ణం కాక అవాకులు చెవాకులు పేలుతూ అక్కసు వెళ్లగక్కుతున్నాడు' అని హరీశ్ రావు మండిపడ్డారు. త్వరలోనే తనకు పతనం తప్పదనే సంగతి అర్థమై ఆగమాగం అవుతున్నడు.త్వరలోనే తన కుర్చీ ఊడుతుందని, తన దోపిడీ ఆగిపోతుందనే భయంతో రేవంత్ రెడ్డి ఇవాళ్టి ప్రెస్ మీట్‌లో అడ్డగోలుగా వాగాడు అంటూ మాజీమంత్రి హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్, తనకు మధ్య విబేధాలు సృష్టించాలని..తద్వారా బీఆర్ఎస్ పార్టీని బలహీన పరిచేందుకు సీఎం రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.'సీఎం రేవంత్ రెడ్డి నీ చీప్ ట్రిక్కులకు, చిల్లర రాజకీయాలకు ఎవడు పడిపోడు. నీ కుట్రలు, కుత్సితాలు ఫలించవు గాక ఫలించవు అని హరీశ్ రావు చెప్పుకొచ్చారు. అనేక సార్లు చెప్పినా..మళ్లీ మళ్లీ చెబుతున్నా రాసి పెట్టుకో రేవంత్ రెడ్డి. ఎప్పటికైనా హరీశ్ రావు గుండెల్లో ఉండేది కేసీఆరే. హరీశ్ రావు చేతిలో ఉండేది గులాబీ జెండానే' అని మాజీమంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. 'నీ దాష్టీకాలు, దుర్మార్గలకు వ్యతిరేకంగా నేనూ, కేటీఆర్ మరింత సమన్వయంగా, మరింత సమర్థవంతంగా రెట్టించిన ఉత్సాహంతో పోరాడుతం.నీ అవినీతిని ఎండగడుతం. అసమర్థతను నిలదీస్తం'అని మాజీమంత్రి హరీశ్ రావు హెచ్చరించారు. 'ఉద్యమ కాలం నుంచి నేటి దాకా తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్న నిన్ను, నీ కాంగ్రెస్‌ను గద్దె దించుతం. నా లక్ష్యమైనా, కేటీఆర్ లక్ష్యమైనా, లక్షలాది గులాబీ సైనికుల లక్ష్యమైనా ఇదే'అని మాజీమంత్రి హరీశ్ రావు చెప్పుకొచ్చారు.'రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ విజయపథంలో పురోగమించడం ఖాయం.మరోసారి కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రి కావడం ఖాయం. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను సంపూర్ణంగా నెరవేర్చడం ఖాయం'అని ధీమా వ్యక్తం చేశారు.

## వెయ్యేనుగుల బలం

మొదటి పేజీ తరువాయి

అన్నారు. తెలంగాణ సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందని చెప్పారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ మద్దతుతో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల అభినందన సభలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పెద్దలు చెప్పినట్లు ఎక్కడైతే అధికారం పోగొట్టుకున్నామో, అక్కడే వెతుక్కోవాలని.. ఈరోజు సర్పంచ్ ఎన్నికల ఫలితాలు ఆ ఉత్సాహాన్ని ఇస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. రెండేళ్ల కిందట అసెంబ్లీ ఎన్నికల్లో కొద్దిపాటి ఓట్ల తేడాతో నిరాశ ఎదురైనా, నేడు భువనగిరిలో 56 మంది, ఆలేరులో 74 మంది, మునుగోడులో 15 మంది, తుంగతుర్తిలో 9 మంది, నకిరేకల్‌లో 7 మంది.. ఇలా జిల్లా వ్యాప్తంగా మొత్తం 161 మంది సర్పంచులను గెలిపించుకోవడం సామాన్య విషయం కాదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయం అత్యంత గలీజుగా మారిందని కేటీఆర్ విమర్శించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నూతనకల్ మండలంలో మల్లయ్య యాదవ్‌ను కిరాతకంగా చంపడం, నల్గొండలో అభ్యర్థిపై దాడి చేసి అమానవీయంగా మూత్రం తాగించి అవమానించడం వంటి ఘటనలు కాంగ్రెస్ నాయకుల వికృత మనస్తత్వానికి నిదర్శనమని అన్నారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ ఎప్పుడూ ఇలాంటి చిల్లర రాజకీయాలకు తావివ్వలేదని కేటీఆర్ అన్నారు. అధికారులు కూడా అధికార పక్షానికి కొమ్ముకాస్తూ, గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థులను దొంగతనంగా ఓడించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. 150కి పైగా గ్రామాల్లో జరుగుతున్న ఈ అన్యాయంపై కోర్టుల ద్వారా న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లోకి వెళ్లామని సిగ్గు లేకుండా మైకుల్లో చెబుతున్న కడియం శ్రీహరి వంటి నాయకులు, అసెంబ్లీలో ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని హీనస్థితిలో ఉన్నారని అన్నారు. 70 ఏళ్ల వయసులో సంపాదించుకున్న గౌరవాన్ని రేవంత్ రెడ్డి సంకలో చేరి నాశనం చేసుకున్నారని ఆరోపించారు. స్పీకర్ కూడా ముఖ్యమంత్రి చెప్పినట్లు ఆడుతూ, ఫిరాయింపులు కనపడనట్లు నటిస్తున్నారని విమర్శించారు. తులం బంగారం ఇస్తామని, పింఛన్లు పెంచుతామని దొంగ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. ఇప్పుడు రైతుబంధు రాక రైతులు అల్లాడుతున్నారని ఆరోపించారు. తినే పళ్లెంలో మన్ను పోసుకున్నామని, పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నామని ప్రజలు బాధపడుతున్నారని వ్యాఖ్యానించారు. వచ్చే జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని, భువనగిరి కోటపై గులాబీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. సర్పంచులు, ఎంపీటీసీలు సమన్వయంతో పనిచేయాలని.. పార్టీ బీ-ఫామ్ మీద జరిగే ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు తిరుగులేని విజయం అందించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు ఎవరి అత్త సొమ్ము కాదని.. అవి రాజ్యాంగబద్ధంగా ప్రజలకు అందాల్సిన హక్కులని, ఏ ఎమ్మెల్యే వాటిని ఆపలేదని అన్నారు. గత పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ, ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లా సాధించిందని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ ప్రతినిధులను కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తోందని ఆరోపించిన కేటీఆర్.. దీనికి భయపడాల్సిన పనిలేదని అన్నారు.

# కడుపులో విషం

మొదటి పేజీ తరువాయి

చేశారు. తెలంగాణలో ఏ ఎన్నికలు వచ్చినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రజాపాలనకు రెండేళ్ల సంబరాలు జరుపుకుంటున్న సమయంలో సర్పంచ్ ఎన్నికల ఫలితాలు అద్భుతంగా వచ్చాయని అన్నారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించారని ఇప్పుడు సర్పంచ్ ఎన్నికలలోనూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారని సీఎం స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. అర్బన్ తెలంగాణతో పాటు రూరల్ తెలంగాణలో ప్రజలు మాకు అండగా నిలిచారని ఈ ఫలితాలు తమ బాధ్యతను మరింత పెంచాయని, భవిష్యత్తులో మరింత బాధ్యతతో పని చేస్తామని స్పష్టం చేశారు.తెలంగాణలో పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుతమైన ఫలితాలు సాధించిందని, ఈ ఫలితాలు మా రెండేళ్ల పరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ రెండు కూటమిగా కలిసి పోటీ చేశాయని అయినా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు సంపూర్ణ విశ్వాసం చూపించారని కొనియాడారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో... ప్రజాస్వామిక బద్ధంగా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించినందుకు ఎన్నికల యంత్రాంగానికి, అధికారులకు ప్రభుత్వం తరఫున అభినందనలు తెలిపారు.గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించినందుకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. 'బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను సాధించడంపై శాసనసభ సమావేశాల్లో చర్చించి అన్ని పార్టీల అభిప్రాయం మేరకు ఎంపీటీసీ,జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయానికి వస్తాం'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. 'రాష్ట్రంలో 12,728 పంచాయతీలకు గాను 12,702 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగ్గా...ప్రజాస్వామిక బద్ధంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం, ప్రజలు స్వేచ్ఛగా తీర్పును ఇవ్వడం అభినందనీయం అని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,702 సర్పంచ్ స్థానాల్లో 7,527 స్థానాల్లో కాంగ్రెస్, 808 స్థానాల్లో కాంగ్రెస్ రెబల్స్ గెలిచారని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కూటమిగా కలిసి 4224 స్థానాలు గెలుచుకున్నాయన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో రెబల్స్ తో కలిపి 66 శాతం కాంగ్రెస్ గెలుచుకుంటే బీఆర్ఎస్, బీజేపీ కలిపి 33 శాతం స్థానాలు గెలుచుకున్నాయని సీఎం చెప్పుకొచ్చారు.

### తొలి ఏడాదిలోనే 61వేల ఉద్యోగాల భర్తీ

ప్రజల ఆశీర్వాదంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండిండినీ సమపాళ్లలో ముందుకు తీసుకెళుతున్నాం అని సీఎం తెలిపారు.'రాష్ట్రంలో కొత్తగా రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ చెల్లింపు, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ. 500 లకే సిలిండర్, 27 వేల కోట్ల రూపాయల మేరకు సున్నా వడ్డీకే మహిళా సమాఖ్యలకు రుణాలు, 4.5 లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 61 వేల ఉద్యోగాల భర్తీ, సుదీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యకు పరిష్కారం, వందేళ్లుగా జరగని బీసీ కులగణన చేపట్టడం, పేదలకు మంచి విద్యను అందించాలన్న ప్రయత్నాలు... ఇలా అనేక అంశాల్లో ప్రభుత్వం ఒక క్రమపద్ధతిలో అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళుతోంది'అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

### కేసీఆర్‌కు సీఎం రేవంత్ సవాల్

కృష్ణా జలాలపై గతంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు.కృష్ణాజలాలపై ప్రతిపక్ష నేతగా లేఖరాయండి. 'కృష్ణా జలాల్లో ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధం. గోదావరి, కృష్ణా జలాలపై సభలో చర్చకు సిద్ధంగా ఉన్నాం'అని సవాల్ విసిరారు.'ఉమ్మడి రాష్ట్రంలో కంటే బీఆర్ఎస్ హయాంలోనే ద్రోహం చేశారు.మీరు చేసిన ద్రోహాన్ని ఆధారాలతో నిరూపిస్తాం'అని సీఎం రేవంత్‌రెడ్డి ఛాలెంజ్ విసిరారు.'ఒకవైపు ఆదాయాన్ని పెంచుకుం టూ దుబారాను తగ్గిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని.. ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం జరక్కుండా ప్రజలకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ తాపత్రయం'అని రేవంత్ తెలిపారు. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులకు సంబంధించి పూర్తి వివరాలతో సభలో చర్చించడానికి సిద్ధంగా ఉందని సీఎం తెలిపారు.

## జయహో భారత్!

మొదటి పేజీ తరువాయి

అనేది భారత్‌లో పుట్టి వినూత్నమైన క్రీడ. సింపుల్‌గా చెప్పాలంటే.. బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, రోలర్ స్కేటింగ్ కలిసిన ఆట. ఈ క్రీడలో ఆటగాళ్ళు రోలర్ స్కేట్స్ ధరించి, బంతిని డ్రిబ్లింగ్ చేస్తూ ఎదుటి జట్టు గోల్ పోస్ట్‌లోకి పంపాలి. ప్రతి జట్టులో 12 మంది ఆటగాళ్ళు ఉంటారు. కానీ మైదానంలో ఒకేసారి 6 మంది మాత్రమే ఆడతారు. ఇందులో ఒక గోల్ కీపర్ ఉంటాడు. ఆటగాళ్ళు స్కేటింగ్ చేస్తూ బంతిని చేత్తో పట్టుకుని బాస్కెట్ బాల్ తరహాలో డ్రిబ్లింగ్ చేయాలి. బంతిని ఒక చేత్తో లేదా రెండు చేతులతో పాస్ చేయవచ్చు.

## హే రామ్.. జీ రామ్..!

మొదటి పేజీ తరువాయి

సాధిస్తుందని, పేదరిక రహిత గ్రామాలుగా మార్చుతుందని, వేగంగా అభివృద్ధి సాధించేలా చేస్తుందని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో ఇప్పటి వరకు 100 రోజుల పని దినాలు ఉండగా.. వికసిత్ భారత్ రోజ్‌గార్, అజీవికా హామీ మిషన్ (గ్రామీణ్) పథకంగా చేసిన మార్పులో భాగంగా ఆ పనిదినాలను 125 రోజులకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే కూలీలకు ఇచ్చే కనీస వేతనాన్ని రూ.240కి పెంచారు. ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 1.51 లక్షల కోట్లు కేటాయించింది. అయితే, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి పేరు మార్చడంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర విమర్శలు చేశాయి. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి పథకానికి పేరు మార్చి, లిఖిత పూర్వకంగానే కాకుండా ఆచరణలోనూ రామ రాజ్య భావనను నాశనం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా గాంధీతో పాటు రవీంద్రనాథ్ ఠాగూర్ గౌరవాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందని మొయిత్రా విమర్శించారు.

## గ్రూప్-3 ఫలితాలు విడుదల

మొదటి పేజీ తరువాయి

ఎంపిక చేసినట్లు ప్రకటించింది. 2022లో 1388 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ గ్రూప్-3 నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. గత ఏడాది నవంబర్ 17, 18 తేదీల్లో ఈ పోస్టులకు రాతపరీక్షలు నిర్వహించారు. అయితే గ్రూప్-1, 2 వివాదాలు, పలు కోర్టు కేసుల కారణంగా ఫలితాల వెల్లడిలో జాప్యం జరిగింది. తాజాగా, ఈ ఏడాది మార్చి 14న ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ ఆధారంగా ఈ ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు కమిషన్ తెలిపింది. ఎంపికైన వారి హాల్ టికెట్ నంబర్లను అధికారిక వెబ్‌సైట్ https://www.tgpsc.gov.inలో అందుబాటులో ఉంచామని, అభ్యర్థులు తమ వివరాలను చూసుకోవచ్చని టీజీపీఎస్సీ సూచించింది.

## విద్య, ఉద్యోగవాణి

**ఐటీఐ అర్హతతో హెచ్ఏఎల్‌లో ఉద్యోగాలు**

మొత్తం పోస్టులు: 156

చివరి తేదీ: డిసెంబర్ 25,2025

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

ఖాళీలు: ఎలక్ట్రానిక్స్ 7, ఫిట్టింగ్ 115, గ్రౌండింగ్ 4, ఇనుస్ట్రుమెంట్ మెకానిక్/ ఇనుస్ట్రుమెంటేషన్ 05, మ్యాచింగ్ 12, టర్నింగ్ 12, ఫిట్టింగ్ 01.

అర్హతలు: సంబంధిత విభాగంలో మూడేండ్ల నేషనల్ అప్రెంటీస్ సర్టిఫికెట్ లేదా రెండేండ్ల ఐటీఐతోపాటు ఏడాది నేషనల్ అప్రెంటీస్ సర్టిఫికెట్ తప్పనిసరి.

వయోపరిమితి: అభ్యర్థుల వయసు 28 సంవత్సరాలకు మించకూడదు. రిజర్వ్ వర్గాలకు సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: డాక్యుమెంట్ వెరిఫికేషన్, రాత పరీక్ష ఆధారంగా ఎంపిక ఉంటుంది.

# ప్రజా సేవకుడిగా గుర్తింపు పొందాలి

**మార్పు, గౌరవం తీసుకొస్తే విజయం తథ్యం.. నిజాయితీగా,ధైర్యంగా నిర్ణయాలు తీసుకోండి .. సివిల్ సర్వీస్ అధికారులకు భట్టి పిలుపు**

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఈవార్తలు): ప్రజలు మిమ్మల్నిఒక అధికారిగా మాత్రమే కాకుండా ప్రజాసేవకుడిగా గుర్తుపెట్టుకోవడం వల్లనే సివిల్ సర్వీసెస్ హెూదాకు న్యాయం చేయగలిగిన వారుగా నిలిచిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఆల్ ఇండియా సర్వీసెస్, సెంట్రల్ సర్వీసెస్ అధికారులు 10 వారాల శిక్షణ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు డిప్యూటీ సీఎం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంసీఆర్‌హెచ్ఆర్డీ వైఎస్ ఛైర్ పర్సన్ శాంతకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రతిరోజు కార్యాలయాన్ని వదిలి వెళ్లే ముందు మిమ్ములని మీరు ఒక ప్రశ్న వేసుకోండి.. మీ పని ద్వారా ఎవరి జీవితంలో అయినా ఒక మంచి మార్పు, గౌరవాన్ని తీసుకువచ్చిందా ప్రశ్నించుకోండి? అవును అని సమాధానం వస్తే.. ఆరోజు మీరు ఎంత కఠినపరిస్థితుల్లో విధి నిర్వహణ చేసినా.. మీరు విజయం సాధించినట్టేనని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. నిజాయితీతో సేవ చేయండి.. ధైర్యంగా



నిర్ణయాలు తీసుకోండి.. మానవత్వంతో వ్యవహరించండి.. నాయకత్వంతో ముందుకు సాగండి.. అని శిక్షణలో ఉన్న అధికారులకు భట్టి విక్రమార్క సూచించారు. కఠినమైన శిక్షణా కార్యక్రమం ముగిసిపోయి.. బాధ్యత, వివేకం, విచక్షణ, ప్రజా విశ్వాసంతో కూడిన కొత్త ఆరంభాన్ని అందిస్తోందని అన్నారు. అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన 203 మంది అధికారులు ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా వారందరికీ ఉప ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఇక్కడకు మీరంతా ఇంజినీర్లు, వైద్యులు, ఆర్థిక నిపుణులు, న్యాయవాదులు, సాంకేతిక నిపుణులుగా వచ్చారు... ఇక్కడనుంచి అత్యున్నత స్థాయి గుర్తింపు, గౌరవంతో బయటకు వెళుతున్నారు. మీ ప్రతిభకు అర్హతలకు అనేక అవకాశాలు మీ ముందున్నాయని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ రోజు కేవలం ఆనందపడే కార్యక్రమం మాత్రమే కాదు. ఇక్కడనుంచి బాధ్యతలు, బదిలీలు, క్లిష్టమైన సమస్యలు, ప్రజలకు సంబంధించిన ఫైళ్లు, ఉంటాయి. మీరు సరైన సమయంలో స్పందించాల్సిన అంశాలు ఉంటాయి. విధి నిర్వహణలో మీరు నిర్లక్ష్యంతో తీసుకునే ఒక నిర్ణయం ఒకరి జీవితాన్ని ఏళ్లపాటు ప్రభావితం చేయగలదు.. అందువల్ల నిబద్ధతతో విధి నిర్వహణ చేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. పాలనలో ఒత్తిడి, కఠినమైన సందర్భాలు, మానవీయతతో కూడిన నిర్ణయాలు, ప్రజాశ్రేయస్సు కోసం శ్రమించే సందర్భాలు.. ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ప్రశంశలు, విమర్శలు కూడా వస్తాయి. అన్నింటిని.. ప్రజల కోసమే అన్నభావనతో ముందుకు వెళ్లాలని ఆయన చెప్పారు. యువ సివిల్ సర్వెంట్స్ గా అడుగు పెడుతున్న ఈ సమయం.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగవంతంగా అభివృద్ధిని సాధిస్తోంది. మీరు ప్రజాసేవలోకి అడుగుపెడుతున్న ఈ సమయం వేగవంతమైన మార్పుల కాలం, టెక్నాలజీ పాలన రూపు రేఖలు మారుస్తోంది అన్నారు. సోషల్ మీడియా విజయాలను, తప్పిదాలను రెండింటినీ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ప్రపంచ ఆర్థిక, వాతావరణ, భౌగోళిక, రాజకీయ షాకులు ముందస్తు హెచ్చరిక లేకుండా వస్తున్నాయి అని డిప్యూటీ సీఎం వివరించారు.

## నాంపల్లి కోర్టుకు సీతక్క హాజరు

నాంపల్లి/హైదరాబాద్, డిసెంబర్ 18 (ఈవార్తలు): తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నమోదైన కేసు విచారణలో భాగంగా ఆమెతో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కూడా కోర్టు ఎదుట హాజరయ్యారు. 2021లో కరోనా మహమ్మారి తీవ్రంగా ఉన్న సమయంలో, కోవిడ్ చికిత్సను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చాలని డిమాండ్ చేస్తూ సీతక్క,



అప్పటి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. కరోనా రోగులకు ఉచిత అంబులెన్స్ సేవలు అందించాలని, వ్యాధితో మరణించిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం చేయాలని వారు అప్పటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయితే, లాక్‌డౌన్ నిబంధనలు అమల్లో ఉండగా ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించి, కరోనా వ్యాప్తికి కారణమవుతున్నారని ఆరోపిస్తూ అప్పటి కేసీఆర్ సర్కార్ సీతక్క, బల్మూరి వెంకట్‌పై కేసు నమోదు చేసింది. ఆ కేసుకు సంబంధించిన విచారణలో భాగంగానే ఇవాళ వారిద్దరూ న్యాయస్థానం ముందు హాజరయ్యారు.

## నవీన్ యాదవ్ వల్లే గెలుపు

**వేరొకరైతే గెలిచేవాళ్లే కాదు.. రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్**

జూబ్లీహిల్స్/హైదరాబాద్, డిసెంబర్ 18 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ అభ్యర్థిగా ఉండటం వల్లే గెలిచారని, ఆయన కాకుండా వేరే ఎవరైనా పోటీ చేసి ఉంటే ఓడిపోయేవారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒక కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, నవీన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కోసం అభ్యర్థిని ఎంపిక చేసే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి పలువురి అభిప్రాయాలు తీసుకున్నారని చెప్పారు. తనను కూడా రేవంత్ రెడ్డి అడిగితే, “జూబ్లీహిల్స్‌లో ఎవరూ గెలవరు.. నవీన్ యాదవ్ అయితేనే గెలుస్తాడు” అని తాను చెప్పానని అన్నారు. ముఖ్యమంత్రి మరికొందరి అభిప్రాయాలు తీసుకుంటే అందరూ అదే చెప్పారని అన్నారు. వాస్తవం చెప్పాలంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో నవీన్ యాదవ్ ఉండటం వల్లే గెలిచాడని అన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు కూడా సహకరించారని ప్రకాశ్ గౌడ్ అన్నారు. శ్రీశైలం యాదవ్ కూడా సినిమా వాళ్లతో ఎంతో స్నేహంగా ఉంటారని, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునేవారని అన్నారు. వారంతా నవీన్ యాదవ్‌కు అండగా నిలబడ్డారని ప్రకాశ్ గౌడ్ తెలిపారు.

## రాజు వెడ్స్ రాంబాయి అద్భుతం

**టీమ్‌ను సన్మానించిన జాగృతి అధ్యక్షురాలు కవిత**

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఈవార్తలు): ఇటీవల చిన్న సినిమాగా విడుదలై మంచి విజయం సాధించిన ‘రాజు వెడ్స్ రాంబాయి’ చిత్ర బృందాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అభినందించారు. గురువారం చిత్ర దర్శకుడు సాయిలు కంపాటి, నిర్మాత వేణు ఉడుగుల సహా ఇతర యూనిట్ సభ్యులను ఆమె శాలువాతో సత్కరించి ప్రశంసలు తెలిపారు. పూర్తి తెలంగాణ నేపథ్యంతో తెరకెక్కిన ఈ చిత్రం విజయం సాధించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.



కవితను కలిసిన వారిలో చిత్ర నిర్మాత వేణు ఉడుగుల, దర్శకుడు సాయిలు కంపాటి, సమర్పకులు పూజారి నాగేశ్వర్ రావు, సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి, గేయ రచయిత మిట్టపల్లి సురేందర్, నటుడు ఆదిత్య, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మురళీ పున్న తదితరులు ఉన్నారు. తమ చిత్ర విజయాన్ని అభినందించినందుకు వారు కవితకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణకు చెందిన కొత్త దర్శకుడు సాయిలు కంపాటి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. అఖిల్ రాజ్, తేజస్విని రావు హీరో, హీరోయిన్లుగా నటించగా, ప్రముఖ నటుడు సిద్దు జొన్నలగడ్డ సోదరుడు చైతన్య జొన్నలగడ్డ ఈ చిత్రంలో విలన్‌గా నటించి మెప్పించాడు. నవంబర్ 21న థియేటర్లలో విడుదలైన ఈ ప్రేమకథా చిత్రం, బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించి నిర్మాతలకు లాభాలను తెచ్చిపెట్టింది. కాగా, ఈ సినిమా నేటి నుంచే (డిసెంబర్ 18) ఈటీవీ విన్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్లలో చూడలేకపోయిన ప్రేక్షకులు ఇప్పుడు ఓటీటీలో ఈ సినిమాను వీక్షించవచ్చు.

## హైదరాబాద్-బెళగావి రైలుకు తప్పిన ప్రమాదం

శంకర్‌పల్లి/రంగారెడ్డి, డిసెంబర్ 18 (ఈవార్తలు): హైదరాబాద్ నుంచి కర్ణాటకలోని బెళగావికి వెళుతున్న ప్రత్యేక రైలు ప్రమాదం నుంచి త్రుటిలో బయటపడింది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు బోగీ కింద మంటలు చెలరేగడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన రైల్వే సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపు చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్ నుంచి బయల్దేరిన ప్రత్యేక రైలు (నం. 07043) శంకర్‌పల్లి స్టేషన్‌లోకి ప్రవేశిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. రైలులోని మొదటి జనరల్ బోగీ కింద నుంచి ఒక్కసారిగా మంటలు, పొగలు రావడాన్ని కొందరు ప్రయాణికులు గమనించారు. వారు వెంటనే రైల్వే సిబ్బందికి సమాచారం అందించడంతో అధికారులు రైలును నిలిపివేశారు. వెంటనే స్పందించిన సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రాథమిక తనిఖీల్లో బ్రేక్ జామ్ కావడం వల్లే రాపిడి జరిగి నిప్పురవ్వలు చెలరేగి మంటలు వ్యాపించినట్లు రైల్వే అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. మంటలను పూర్తిగా ఆర్పేసి, సాంకేతిక నిపుణులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత రైలు తిరిగి తన ప్రయాణాన్ని కొనసాగించింది. ప్రయాణికుల అప్రమత్తత, సిబ్బంది సత్వర స్పందనతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు.

## టాంజానియాలో తెలంగాణ వ్యక్తి హఠాన్మరణం

మునుగోడు, డిసెంబర్ 18 (ఈవార్తలు): ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన ఓ వ్యక్తి గుండెపోటుతో అకాల మరణం చెందడంతో నల్లగొండ జిల్లాలో విషాదం నెలకొంది. మునుగోడు మండలం పలివెల గ్రామానికి చెందిన బడుగు రాజు (38) ఆఫ్రికా దేశమైన టాంజానియాలో గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయాన్ని అతడి సహెూద్యోగులు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. వివరాల్లోకి వెళితే, బడుగు రాజు టాంజానియా రాజధాని దారుస్సలాంలో జియాలజిస్ట్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో ఉండగానే అతడు గుండెపోటుకు గురై మరణించినట్లు సమాచారం. రాజు మరణవార్త తెలియడంతో పలివెల గ్రామంలో, ఆయన కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు... రాజు మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు వారు టాంజానియాలోని భారత రాయబార కార్యాలయ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. వీలైనంత త్వరగా మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని వారు తెలిపారు.

## కడియం చరిత్రహీనుడు

**రాజీనామా చేయాలి: రాజయ్య**

వరంగల్, డిసెంబర్ 18 (ఈవార్తలు): బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్టీ ఫిరాయింపు ఆరోపణలపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన నోటీసులకు కడియం చరిత్రహీనుడిలా వివరణ ఇచ్చారని మండిపడ్డారు. ఈరోజు వరంగల్‌లో మీడియాతో మాట్లాడిన రాజయ్య... కడియం శ్రీహరి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. “అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లోకి వెళ్తున్నానని చెప్పి, ఇప్పుడు బీఆర్ఎస్‌లోనే ఉన్నానని చెప్పడం సిగ్గుచేటు. ఏమాత్రం నైతిక విలువలున్నా కడియం శ్రీహరి వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. బీఆర్ఎస్ పార్టీకి చేసిన ద్రోహానికి ముందుగా క్షమాపణ చెప్పాలి” అని రాజయ్య డిమాండ్ చేశారు. రాజీనామా చేయని పక్షంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ప్రతి వీధిలో ఆయన దిష్టిబొమ్మలు వేలాడదీస్తామని హెచ్చరించారు. ఈ విషయంలో స్పీకర్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మరోవైపు, స్పీకర్ నోటీసులపై కడియం శ్రీహరి బుధవారం లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చిన విషయం తెలిసిందే.

## దివ్యాంగుల కోసం సరికొత్త మోడల్

**ప్రభుత్వ-స్టార్టప్ భాగస్వామ్యంతో టెక్నాలజీ**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఈవార్తలు): సంక్షేమంతో పాటు దివ్యాంగులు స్వతంత్రంగా, గౌరవప్రదమైన జీవనం సాగించాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఏలియన్ ఇన్నోవేషన్స్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన దివ్యాంగుల కోసం అసిస్టివ్ టెక్నాలజీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులు కేవలం సహాయం పొందే వర్గం కాదని, అవకాశం ఇస్తే తమ కాళ్లపై తామే నిలబడి ఆత్మవిశ్వాసంతో జీవించగల సామర్థ్యం ఉన్న పౌరులని మంత్రి పేర్కొన్నారు. ఇదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన దృక్పథమని తెలిపారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం పింఛన్లకే పరిమితం కాకుండా విద్య, ఉపాధి, ఉద్యోగ రిజర్వేషన్, టెక్నాలజీ, స్వయం ఉపాధి అన్నీ కలిసేలా సమగ్ర విధానంతో పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు ఉన్న రిజర్వేషన్ కాగితాల్లోనే కాకుండా వాస్తవంగా ఉద్యోగాల్లో కనిపించాలన్నదే సీఎం గారి స్పష్టమైన ఆదేశమని గుర్తు చేశారు. ఈ లక్ష్య సాధనలో టెక్నాలజీ ఆధారిత ఇన్నోవేషన్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ అనేక మంది యువ ఆవిష్కర్తలకు మార్గదర్శకత్వం చేస్తూ స్టార్టప్‌లుగా మార్చడంలో ముందుండి పనిచేస్తోందని ప్రశంసించారు.

# బీజేపీ ఆఫీస్‌ల ముట్టడి

**సోనియాపై కేసుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన.. పలుచోట ఉద్రిక్త పరిస్థితులు**

**(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్)**

తెలంగాణలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నేషనల్ హెరాల్డ్ కేసులో గత పదేళ్లుగా సోనియా, రాహుల్ గాంధీలను ఈడీ ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేధించిందంటూ కాంగ్రెస్ శ్రేణులు మండిపడుతున్నారు. ఇటీవల ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి నిరాకరించడంతో, ఇది తమ నేతలపై జరిగిన కుట్ర అని కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది. బీజేపీ రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న బీజేపీ ఆఫీసుల ముట్టడికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం గాంధీ భవన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బీజేపీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ గాంధీ భవన్ నుంచి నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులు ప్రయత్నించాయి. అయితే, శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నప్పటికీ, శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు భారీగా మోహరించారు. గాంధీ భవన్ మెయిన్ గేట్ వద్ద ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సహా పలువురు ముఖ్య నేతలను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న కాంగ్రెస్




ప్రజాప్రతినిధులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. తనను అక్రమంగా గృహనిర్బంధం చేయడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనలో పాల్గొనేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చే క్రమంలో గేటు దూకి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని ఆయన విమర్శించారు. అయితే కేవలం హైదరాబాద్‌లోనే కాకుండా, తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో బీజేపీ కార్యాలయాల ముట్టడికి కాంగ్రెస్ కార్యకర్తలు తరలివచ్చారు. చాలా చోట్ల కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. సోనియా, రాహుల్ గాంధీలపై అక్రమ కేసులు పెట్టి బీజేపీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందని, ఈ విషయంలో ప్రధాని మోదీ బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. పోలీసులు అడ్డుకున్నా, అరెస్టులకు భయపడకుండా తమ నిరసనలు కొనసాగిస్తామని పార్టీ ప్రకటించింది. కాంగ్రెస్ ముట్టడి పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీజేపీ కార్యాలయాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. నాంపల్లిలోని బీజేపీ కార్యాలయానికి వెళ్లే రహదారులను బారికేడ్లతో మూసివేశారు. బీజేపీ నాయకులు కూడా కాంగ్రెస్ వైఖరిని తప్పుపడుతూ, కోర్టు ప్రక్రియను రాజకీయ నిరసనలుగా మార్చడం సరికాదని హితవు పలుకుతున్నారు.

# గాంధీ పేరు తీసేస్తే చరిత్ర మారుతుందా?

**నరేగా పేరు మార్పు గాంధీజీని అవమానించినట్లే**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజం**

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఈవార్తలు): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో గాంధీజీ పేరును తొలగించడం ఆయనను అవమానించినట్లేనని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయన పేరును తొలగించడం సిగ్గుచేటని అన్నారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలన్న లక్ష్యంతో 2005లో ఆనాటి యూపీఎ ప్రభుత్వం చారిత్రాత్మకమైన ఉపాధి హామీ పథకాన్నితీసుకువస్తే గడచిన పది సంవత్సరాల నుంచి బిజేపీ ప్రభుత్వం ఆ పథకానికి తూట్లుపొడుస్తూ నీరుగారుస్తోందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి, రాష్ట్రాలపై 40 శాతం భారాన్ని నెట్టడం పేదల పొట్ట కొట్టడమేనని దుయ్యబట్టారు. ఈ రోజు పార్లమెంట్‌లో తీసుకువచ్చిన బిల్లు అభివృద్ధి తిరోగమనమేనని, రాష్ట్రాలపై మోయలేని భారమని అన్నారు. భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన ‘మహాత్మా గాంధీ జాతీయ



గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్‌గా మార్చడం అన్యాయమని అన్నారు. లోక్‌సభలో బలవంతంగా గురువారం ఆమోదించిన ఈ కొత్త బిల్లు, పథకం స్వభావాన్ని, నిధుల సమీకరణను పూర్తిగా మార్చివేసిందని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్య ఫలాలు అందించిన మహనీయుడు, జాతిపిత మహాత్మా గాంధీ పేరు మీద 20 ఏళ్ల క్రితం యూపీఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం పేరు మార్చడం వెనుక కేంద్ర పాలకుల సంకుచిత మనస్తత్వం కనిపిస్తోందని, పేరు మార్చినంత మాత్రాన వారి వైఫల్యాల నుంచి కప్పిపుచ్చుకోలేరని అన్నారు. వికసిత్ భారత్ అని నినాదాలు ఇస్తూ, గ్రామీణ భారతానికి వెన్నెముకగా ఉన్న పథకాన్ని అగాధంలోకి నెడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, పేదల కడుపు కొడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# పర్ఫెక్షనే కాదు.. సిన్సియారిటీ ముఖ్యం

**పాలనలో ప్రజల భాగస్వామ్యంతోనే గుడ్ గవర్నెన్స్**

**యువ సివిల్ సర్వెంట్లకు దుద్దిళ్ల దిశానిర్దేశం**

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఈవార్తలు): ‘ఈ దేశం మీ నుంచి కేవలం పర్ఫెక్షన్ మాత్రమే ఆశించడం లేదు.. అంతకంటే ఎక్కువగా మీరు చేసే పనిలో సిన్సియారిటీని కోరుకుంటోంది’ అని యువ సివిల్ సర్వెంట్లకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దిశా నిర్దేశం చేశారు. గురువారం జూబ్లీహిల్స్ లోని డా.ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ తెలంగాణలో నిర్వహించిన ‘స్పెషల్ ఫౌండేషన్ కోర్స్ ఫర్ ఏఐఎస్ అండ్ సీసీఎస్ ఆఫీసర్స్ 2025’ ముగింపు వేడుకలకు ఆయన విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... గవర్నెన్స్ అంటే కేవలం ఫైళ్లు, నిబంధనలు కాదని, అది ప్రజలతో మమేకమయ్యే ఒక హ్యూమన్ రిలేషన్ అని అన్నారు. అధికారం, హెూదా, ప్రోటోకాల్స్ అన్నీ తాత్కాలికమని.. ప్రజల జీవితాల్లో మీరు తీసుకొచ్చే సానుకూల మార్పు మాత్రమే శాశ్వతమన్నారు. నిర్ణయాలు తీసుకునే సమయంలో సమాజంలోని చిట్టచివరి వ్యక్తిని, నిరుపేదల ప్రయోజనాలనూ పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. అప్పుడే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందుతాయన్నారు. కార్యాలయాలకు మాత్రమే పరిమితం కాకుండా నిత్యం ప్రజలతో మమేకం కావాలని ఉద్బోధించారు. ప్రజా సేవలో బాహ్య ఒత్తిళ్ల కంటే అహంకారం, ఉదాసీనత, అవినీతి లాంటి అంతర్గత బలహీనతలే ప్రమాదకరమని హెచ్చరించారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ స్వీయ నియంత్రణ పాటిస్తూనే... నిజాయితీ, వినమ్రత, ధైర్యం కోల్పోవద్దని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పౌర సేవలు ప్రజల ముంగిటకు చేరాలంటే టెక్నాలజీ వినియోగం అత్యవసరమన్నారు. అయితే... ఆ సాంకేతికత ప్రజలకు చేరువగా ఉండాలి కానీ, వారిని భయపెట్టేలా ఉండొద్దన్నారు. పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే ‘గుడ్ గవర్నెన్స్’



సాధ్యమవుతుందని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేయాలని యువ అధికారులకు సూచించారు.



# బ్యాంకింగ్‌లో 'సహకార'మే కీలకం

హైదరాబాద్, డిసెంబర్ 18 (ఈవార్తలు): భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థలో సహకార పట్టణ బ్యాంకులు కీలకమైన పాత్ర వహిస్తున్నాయని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్ రావు అన్నారు. మహేష్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌కు జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గాన్ని ఆయన సత్కరించారు. కార్యక్రమంలో మహేష్ బ్యాంక్ మాజీ చైర్మన్ రమేష్ బంగ్, గోవింద్ రాఠీ, వై. కృష్ణ, శివలాల్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.



# కొండగట్టులో గడ్డం శ్రీనివాస్ పూజలు

మల్యాల, డిసెంబర్ 18 (ఈవార్తలు): కొండగట్టు అంజన్నను జగిత్యాల బీజేపీ ఇన్చార్జ్ గడ్డం శ్రీనివాస్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వారి వెంట బీజేపీ మల్యాల మండలాధ్యక్షుడు గాజుల మల్లేశం, నవీన్, సంకీర్త్ ఉన్నారు.


# మల్యాల ఉపసర్పంచ్‌గా కట్కం వినయ్



మల్యాల, డిసెంబర్ 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నికల్లో రెండో వార్డు సభ్యుడు కటకం వినయ్ కుమార్ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వినయ్ కుమార్ యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వాయిదా పడ్డ ఉప సర్పంచ్ ఎన్నికలను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం నిర్వహించగా, సింగిల్ నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.

**మల్యాలలో యువ నాయకత్వం**

మల్యాల మేజర్ గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం పూర్తిగా యువనాయకత్వంతో కొలువుదీరనుంది. సర్పంచ్ బొట్ల జయకు 45 ఏళ్లు కాగా, ఉపసర్పంచ్ కట్కం వినయ్‌కు 32 ఏళ్ళు మాత్రమే ఉన్నాయి. పంచాయతీ పరిధిలోని 16 వార్డుల్లో గెలుపొందిన వార్డు సభ్యులు 25 నుంచి 42 ఏళ్ల వారే కావడం విశేషం. దీంతో యువత రాజకీయాల వైపు రావడానికి ఆసక్తి చూపుతున్నారనడానికి ఈ పంచాయతీ నిదర్శనంగా మారింది.



# ఢిల్లీకి చంద్రబాబు

**నేడు కేంద్ర మంత్రులతో భేటీలు**

అమరావతి, డిసెంబర్ 18 (ఈవార్తలు): ఏపీలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయంపై కేంద్ర మంత్రులతో చర్చించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం సాయంత్రం 6 గంటలకు అమరావతి నుంచి ఢిల్లీ బయలుదేరి వెళుతున్నారు. శుక్రవారం వరుసగా ఆరుగురు కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్, పెట్రోలియం-సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి, కేంద్ర నౌకాయాన, జలరవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌తో భేటీ అవుతారు. ఈ సమావేశాల్లో కేంద్ర భాగస్వామ్యంతో రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతి, వాటికి అవసరమైన నిధులు, అనుమతులపై చర్చిస్తారు. ముఖ్యంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని శుక్రవారం రాత్రికే ఆయన తిరిగి అమరావతి చేరుకుంటారు. అనంతరం శనివారం అనకాపల్లి జిల్లాలో జరిగే 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటారు.

# పోలవరం ఏం మారలేదు!

**కూటమి సర్కారుపై ఉండవల్లి మండిపాటు**

రాజమండ్రి, డిసెంబర్ 18 (ఈవార్తలు): ఏపీలో కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడినా పోలవరం ప్రాజెక్టు పనులు నత్తనడకనే సాగుతున్నాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు తరచూ ప్రాజెక్టును సందర్శించడం వల్ల పనులు వేగవంతం కాకపోగా, మరింత జాప్యం జరుగుతోందని ఆయన ఆరోపించారు. వారి పర్యటనల సమయంలో మొత్తం అధికార యంత్రాంగం అంతా వారి చుట్టూనే తిరగాల్సి వస్తోందని, ఇది పనులపై ప్రభావం చూపుతోందని అన్నారు. గురువారం రాజమండ్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉండవల్లి మాట్లాడారు. పోలవరంలో గతంలో దెబ్బతిన్న డయాఫ్రం వాల్ స్థానంలో కొత్తది నిర్మిస్తున్నారని, అయితే గతంలో రూ.440 కోట్లతో డయాఫ్రం వాల్ విఫలం కాగా, అదే బావర్ కంపెనీకి ఇప్పుడు రూ.990 కోట్లతో పనులు ఎలా అప్పగించారని ప్రశ్నించారు. ఈ వైఫల్యంపై ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదని నిలదీశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదం వల్లే డయాఫ్రం వాల్ దెబ్బతిందని గత సీఎం జగన్ స్పష్టం చేశారని గుర్తుచేశారు. పోలవరం డయాఫ్రం వాల్ వైఫల్యంపై నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను ఎందుకు బయటపెట్టడం లేదని ఉండవల్లి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సమాచార హక్కు చట్టం కింద నివేదికను అడిగితే 'కాపీరైట్' వర్తిస్తుందని చెప్పడం దారుణమన్నారు. డయాఫ్రం వాల్ కొట్టుకుపోవడం మానవ తప్పిదమా లేక భారీ వరదల వల్ల జరిగిందా అనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే సందర్భంగా, గతంలో జరిగిన గోదావరి పుష్కరాల తొక్కిసలాటకు ముహూర్తం అనే మూఢనమ్మకమే కారణమని కమిషన్ తేల్చినా, అప్పట్లో బీజేపీతో పొత్తులో ఉండటం వల్ల టీడీపీ ప్రభుత్వం మౌనంగా ఉందని ఉండవల్లి విమర్శించారు.

# చంద్రబాబు గ్రాఫ్ పడిపోతోంది

**స్వయంగా బాబే చెప్పుకున్నారు**

**కోటి సంతకాల ఉద్యమం చారిత్రక విజయం**

**మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అతిపెద్ద స్కాం**

**ప్రైవేటుకు కాలేజీలిచ్చి జీతాలు ఎలా ఇస్తారు?: జగన్**



తాడేపల్లి, డిసెంబర్ 18 (ఈవార్తలు): చంద్రబాబు ప్రభుత్వంపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'కోటి సంతకాల ఉద్యమం' చారిత్రక విజయం సాధించిందని, ఇంత పెద్ద సంతకాల ఉద్యమం దేశ చరిత్రలోనే జరగలేదని అన్నారు. ముఖ్యంగా, మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు కట్టబెట్టడం అతిపెద్ద స్కాం అని ఆయన ఆరోపించారు. పార్టీ ముఖ్య నేతలతో ఈరోజు సమావేశమైన ఆయన మాట్లాడుతూ... "ప్రైవేటుకు కాలేజీలు ఇచ్చి, మళ్లీ రూ.120 కోట్ల ప్రజాధనాన్ని జీతాల కింద ఎలా ఇస్తారు? ఇంతకంటే పెద్ద స్కాం ఉంటుందా?" అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ ఉద్యమంలో భాగంగా కోటి 4 లక్షల 11 వేల 136 మంది సంతకాలు చేశారని, ఇది ఒక చరిత్ర అని పేర్కొన్నారు. ఉద్యమాన్ని విజయవంతం చేసిన గ్రామస్థాయి కార్యకర్త నుంచి ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. చంద్రబాబు గ్రాఫ్ పడిపోతోందని స్వయంగా ఆయనే చెప్పుకున్నారని జగన్ వ్యాఖ్యానించారు. కూటమి పాలనలో రెండు బడ్జెట్‌లు ప్రవేశపెట్టినా ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. తమ హయాంలో అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా వంటి పథకాలను రద్దు చేశారని ఆరోపించారు. ప్రైవేటీకరణ అంటే దోపిడీ అని, విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని జగన్ స్పష్టం చేశారు. తాము ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి బతికించామని, కానీ నేడు అన్ని వ్యవస్థలు తిరోగమనంలో ఉన్నాయని అన్నారు. చంద్రబాబు తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కలెక్టర్లపైకి నెట్టేస్తున్నారని ఆరోపించారు.

# ఏపీలో జనాభా సంక్షోభం

**రెండో బిడ్డను కంటే ప్రోత్సాహకాలు!**



విజయవాడ, డిసెంబర్ 18 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో జనాభా సంక్షోభం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు ఆందోళనకరంగా పడిపోవడంతో, భవిష్యత్తులో తలెత్తే తీవ్ర పరిణామాలను నివారించేందుకు ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఫ్రాన్స్, హంగేరీ వంటి దేశాల్లో అమలు చేస్తున్న తరహాలో 'రెండో బిడ్డను కనేవారికి' ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. గురువారం అమరావతిలో జరిగిన 5వ కలెక్టర్ల సదస్సులో ఈ ఆందోళనకరమైన గణాంకాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ బయటపెట్టారు. జాతీయ సగటు 28.4 ఏళ్లతో పోలిస్తే, ఏపీలో సగటు వయసు 32.5 ఏళ్లుగా ఉందని, ఇది రాష్ట్రం వేగంగా వృద్ధాప్యం వైపు వెళ్తోందనడానికి సంకేతమని ఆయన వివరించారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5కు పడిపోయిందని, ఇది సాధారణంగా ఉండాల్సిన 2.1 కంటే చాలా తక్కువని తెలిపారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే 2040 నాటికి రాష్ట్రంలో వృద్ధుల జనాభాపై ఆధారపడే వారి సంఖ్య భారీగా పెరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. తగ్గుతున్న సంతానోత్పత్తి రేటుపై తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకప్పుడు కుటుంబ నియంత్రణకు పెద్దపీట వేసిన తాము, ఇప్పుడు జనాభాను పెంచేందుకు ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. "అభివృద్ధి చెందిన దేశాలు ఎదుర్కొంటున్న సమస్యనే ఇప్పుడు మనం ఎదుర్కొంటున్నాం. పనిచేయని వయసు జనాభా పెరుగుతోంది. ఇకపై పిల్లల్ని కనేలా కుటుంబాలను ప్రోత్సహించడంపైనే మన దృష్టి ఉండాలి," అని సౌరభ్ గౌర్ స్పష్టం చేశారు. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం వినూత్న ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో 'ఫెర్టిలిటీ కాలేజీలు' ఏర్పాటు చేయనున్నట్లు గౌర్ తెలిపారు. వీటి ద్వారా సంతానలేని దంపతులకు ప్రభుత్వ సహాయంతో ఐవీఎఫ్ చికిత్స అందించి, జనాభా సుస్థిరతకు దోహదపడతామన్నారు. దీంతో పాటు మహిళల ఉపాధిని ప్రోత్సహించేందుకు కార్యాలయాల్లో తప్పనిసరిగా క్రెచ్ (శిశు సంరక్షణ కేంద్రాలు) ఏర్పాటు చేయడం ద్వారా వారి భాగస్వామ్యాన్ని 31 శాతం నుంచి 59 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల రాష్ట్ర జీఎస్‌డీపీ 15 శాతం మేర పెరిగే అవకాశం ఉందని అంచనా.

# మీరు నీతులు చెప్పడమా?

**షర్మిలపై పీవీఎన్ మాధవ్ ఫైర్**

విజయవాడ, డిసెంబర్ 18 (ఈవార్తలు): ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మహాత్ముడి పేరు అడ్డుపెట్టుకుని దశాబ్దాలుగా దేశాన్ని దోచుకున్న కాంగ్రెస్ నేతలు నీతులు చెబుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై షర్మిల చేస్తున్న విమర్శలను ఆయన గట్టిగా తిప్పికొట్టారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. "ఉపాధి హామీ పథకంలో నకిలీ ఖాతాలు సృష్టించి గాంధీజీ ఆశయాలను మీరు ఆనాడే చంపేశారు. దేశంలోని పథకాలకు సర్దార్ పటేల్, సుభాష్ చంద్రబోస్, లాల్ బహదూర్ శాస్త్రి వంటి మహనీయుల పేర్లు పెట్టకుండా, కేవలం ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల పేర్లు పెట్టి ఒకే కుటుంబానికి దేశాన్ని ధారాదత్తం చేశారు" అని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ గాంధీజీ ఆకాంక్షించిన 'గ్రామ స్వరాజ్యాన్ని' ఆచరణలో చూపిస్తూ కొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టారని మాధవ్ పేర్కొన్నారు. "ప్రధాని మోదీ ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పనిని 125 రోజులకు పెంచి పేదలకు అదనపు ఉపాధి కల్పిస్తున్నారు. వారంలోగా జీతాలు అందేలా చట్టబద్ధత కల్పిస్తున్నారు. రైతులకు, కూలీలకు ప్రయోజనం చేకూర్చేందుకు 'హార్వెస్ట్ పాజ్' వంటి విధానాలు తీసుకొచ్చారు. అవినీతిని రూపుమాపి, అభివృద్ధికి బాటలు వేస్తున్న ఈ పథకాన్ని స్వాగతించాల్సింది పోయి, అనవసర రాద్ధాంతం చేస్తూ ఈ ఏడుపు ఎందుకు?" అని మాధవ్ మండిపడ్డారు.

# ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు నక్సల్స్ మృతి

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లాలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఈ తెల్లవారుజామున జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు. గొల్లపల్లి అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ ప్రాంతంలో ప్రస్తుతం కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. సుక్మా జిల్లాలోని గొల్లపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారంతో స్థానిక పోలీసులు, భద్రతా బలగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. బలగాలు అడవిని జల్లెడ పడుతుండగా, మావోయిస్టులు వారిపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. ఘటనా స్థలంలో ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, ఆపరేషన్ ముగిసిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామని ఉన్నతాధికారులు వెల్లడించారు.

# ఏపీలో ఐదు జిల్లాలకు ఇంఛార్జ్ ఐఏఎస్‌లు

ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేయడమే లక్ష్యం

విజయవాడ, డిసెంబర్ 18 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా స్థాయి పాలనను మరింత పటిష్ఠం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ లక్ష్యాల అమలును వేగవంతం చేసే ఉద్దేశంతో ఐదు జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ అధికారులను ఇంఛార్జ్‌లుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

**నియమితులైన అధికారుల వివరాలు:**

**తూర్పు గోదావరి జిల్లా ఇంఛార్జ్‌గా జి. వీరపాండియన్**
**కాకినాడ జిల్లా ఇంఛార్జ్‌గా ప్రసన్న వెంకటేశ్**
**బాపట్ల జిల్లా ఇంఛార్జ్‌గా మల్లికార్జున్**
**శ్రీ సత్యసాయి జిల్లా ఇంఛార్జ్‌గా గంధం చంద్రుడు**
**నంద్యాల జిల్లా ఇంఛార్జ్‌గా సీహెచ్ శ్రీధర్**

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను క్షేత్రస్థాయిలో వేగంగా, సమర్థవంతంగా అమలు చేయడమే ఈ నియామకాల ముఖ్య ఉద్దేశమని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ అధికారులు తమకు కేటాయించిన జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షిస్తారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం సాధించడం, ప్రజా సేవల పనితీరును మెరుగుపరచడం వంటి కీలక బాధ్యతలను నిర్వర్తిస్తారు. ఈ నియామకాల ద్వారా జిల్లాల పరిపాలన మరింత క్రియాశీలంగా మారుతుందని, ప్రభుత్వ విధానాలు ప్రజలకు సకాలంలో చేరతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# ఇమ్రాన్ ఖాన్ చెల్లెళ్లపై కేసు

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని, పీటీఐ పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్ ను అవినీతి కేసులో జైలుకు పంపిన ప్రభుత్వం.. ఆయన సోదరీమణులపై కూడా యాంటీ టెర్రరిస్ట్ యాక్ట్ కింద కేసు నమోదు చేసింది. ఇమ్రాన్ ను కలుసుకోవడానికి అధికారులు నిరాకరించడంతో ఆయన సోదరీమణులు అడియాలా జైలు ముందు ఆందోళన చేయగా పోలీసులు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

# ఆ భూమి తెలంగాణ సర్కారుదే

**సుప్రీం కోర్టు కీలక తీర్పు.. రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫైకి ఆదేశం**

న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. రూ.15వేల కోట్ల విలువ చేసే భూములకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు ఇచ్చింది. హైదరాబాద్ వనస్థలిపురం సమీపంలోని సాహెబ్‌నగర్ వద్ద ఉన్న 102 ఎకరాల భూమి తెలంగాణ అటవీశాఖదేనని తేల్చింది. దాదాపు 20 ఏళ్లుగా ఈ భూ వివాదం కొనసాగుతోంది. ఈ భూమిపై యాజమాన్య హక్కులు కోరుతూ నిజాం, సాలార్ జంగ్, మీరాలం వారసులమంటూ పలువురు న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేశారు. గతంలో పిటిషన్లు వేసిన 260 మందికి అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిల ధర్మాసనం.. ఇది పూర్తిగా అటవీ భూమి అని రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి హక్కులు కల్పిస్తూ తీర్పు ఇచ్చింది. తీర్పు వెలువడిన 8 వారాల్లో రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించింది. నోటిఫికేషన్ ప్రతిని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి పంపాలని ధర్మాసనం ఆదేశించింది.

# లులు మాల్‌పై కేసు నమోదు

**నిధి అగర్వాల్‌కి చేదు అనుభవం**

కూకట్‌పల్లి/హైదరాబాద్, డిసెంబర్ 18 (ఈవార్తలు): ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న 'ది రాజా సాబ్' మూవీ సాంగ్ లాంఛ్ ఈవెంట్‌లో హీరోయిన్ నిధి అగర్వాల్‌కి చేదు అనుభవం ఎదురైంది. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని లూలూ మాల్‌లో 'ది రాజా సాబ్' మూవీ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కి హీరోయిన్ నిధి అగర్వాల్ హాజరైంది. హీరోయిన్ వస్తుందని తెలియడంతో అక్కడికి భారీ సంఖ్యలో ప్రభాస్ అభిమానులు చేరుకున్నారు. సాంగ్ లాంఛ్ తర్వాత హీరోయిన్ అక్కడి నుంచి వెళ్లే సమయంలో అభిమానులు ఆమెని చుట్టుముట్టి, అసభ్యంగా ప్రవర్తించారు. నిధి అగర్వాల్ చుట్టూ సెక్యూరిటీ సిబ్బంది ఉన్నప్పటికీ అభిమానులు వందల సంఖ్యలో ఉండడంతో వారిని నిలువరించడానికి బాగా కష్టపడాల్సి వచ్చింది. అభిమానుల నుంచి తప్పించుకుని తన కారులో ఎక్కడానికి హీరోయిన్ నిధి అగర్వాల్ తీవ్రంగా కష్టపడాల్సి వచ్చింది. ఈ ప్రయత్నంలో ఆమె డ్రెస్సు కూడా చిగిరిపోయినట్టుగా వైరల్ వీడియోలో తెలుస్తోంది. ఈ అనుకోని అనుభవం కారణంగా షాక్‌కి గురైన నిధి అగర్వాల్, తన కారులో కూర్చున్న తర్వాత బాధతో ఏడవడం కూడా కెమెరాల్లో రికార్డు అయ్యింది. ఈ విషయంపై హీరోయిన్, ఇప్పటిదాకా పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అయితే వైరల్ వీడియో ఆధారంగా సుమోటోగా కేసు నమోదు చేసుకున్న కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ పోలీసులు, ఈవెంట్ నిర్వహకులైన శ్రేయస్ మీడియాపై, లూలూ మాల్ నిర్వాహకులపై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేశారు. అటు ఈవెంట్ నిర్వాహకులు కానీ, ఇటు లూలూ మాల్ మేనేజ్‌మెంట్ కానీ ఈవెంట్ గురించి పోలీసులకు తెలియ చేయడం కానీ, అనుమతులు తీసుకోవడం కానీ చేయలేదని పోలీసులు తెలియచేశారు.



# బీజేపీపై జీవన్ రెడ్డి ఫైర్

జగిత్యాల టౌన్, డిసెంబర్ 18 (ఈవార్తలు): జగిత్యాలలో కాంగ్రెస్ శ్రేణులు రోడ్డెక్కాయి. నేషనల్ హెరాల్డ్ కేసులు, ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగింపును నిరసిస్తూ డీసీసీ ఆధ్వర్యంలో జగిత్యాల తహసీల్ చౌరస్తా వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. యంగ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో పత్రికను చట్టబద్ధంగా కొనుగోలు చేసి పునరుద్ధరణకు ప్రయత్నం చేసినప్పటికీ, ఎలాంటి ఆధారాలు లేకుండా ఎన్డీఏ ప్రభుత్వం కుట్రపూరితంగా గాంధీ కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను దోషులుగా చూపేందుకు ఈడీ ద్వారా ఢిల్లీ హైకోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారని, అయితే ఆధారాల లేమితోనే కోర్టు తిరస్కరించిందని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికైనా బీజేపీ కళ్లు తెరుచుకుంటుందని ఆశిస్తున్నానని వ్యాఖ్యానించారు. ధర్నాకు భారీగా కాంగ్రెస్ శ్రేణులు తరలిరావడంతో జగిత్యాల తహసీల్ చౌరస్తా పరిసరాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

# వల్లభనేని వంశీపై కొత్త కేసు

విజయవాడ, డిసెంబర్ 18 (ఈవార్తలు): గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీపై విజయవాడలోని మాచవరం పోలీస్ స్టేషన్‌లో కొత్తగా మరో కేసు నమోదైంది. గత ఏడాది జులై నెలలో తనపై వంశీ, ఆయన అనుచరులు దాడి చేశారంటూ సునీల్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. బాధితుడు సునీల్ ఇటీవల పోలీసులను ఆశ్రయించి తనపై జరిగిన దాడి గురించి ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా వల్లభనేని వంశీని ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ, ఆయనతో పాటు మరో ఎనిమిది మంది అనుచరులపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది. కాగా, వల్లభనేని వంశీ ఇప్పటికే పలు కేసులను ఎదుర్కొంటున్నారు. గతంలో ఓ టీడీపీ కార్యకర్త కిడ్నాప్, బెదిరింపుల కేసులో ఈ ఏడాది ఫిబ్రవరి 16న అరెస్ట్ అయ్యారు. ఆ తర్వాత ఆయనపై వరుసగా కేసులు నమోదయ్యాయి. మొత్తం 11 కేసుల్లో నిందితుడిగా ఉన్న ఆయన, 140 రోజుల పాటు జైలులో గడిపి బెయిల్ పై విడుదలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా మరో దాడి కేసు నమోదు కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.




# జనవరి నుంచి ఎంజీ కార్లు ప్రియం

**మోడల్‌ను బట్టి 2 శాతం వరకు పెరగనున్న రేట్లు**

**ముడిసరుకుల వ్యయమే కారణమంటున్న కంపెనీ**

ముంబై: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా తమ వాహనాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. కొత్త ఏడాది ప్రారంభం నుంచి, అంటే జనవరి 1 నుంచి తమ కార్ల ధరలను 2 శాతం వరకు పెంచనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పెంపు అన్ని మోడళ్లకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. ముడిసరుకుల ధరలు పెరగడం, ఇతర స్థూల ఆర్థిక పరిస్థితుల కారణంగా ధరలను సవరించాల్సి వస్తోందని కంపెనీ వివరించింది. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఎంజీ హెక్టర్, జడ్‌ఎస్ ఈవీ, గ్లోస్టర్, ఆస్టర్, కామెట్, విండ్సర్ వంటి అన్ని మోడళ్లపై ఈ ధరల పెంపు ప్రభావం చూపనుంది. అయితే, కారు మోడల్, వేరియంట్‌ను బట్టి ధరల పెంపులో స్వల్ప మార్పులు ఉంటాయని కంపెనీ పేర్కొంది. కొత్త సంవత్సరం సందర్భంగా కార్ల ధరలను పెంచడం ఆటోమొబైల్ పరిశ్రమలో సాధారణంగా మారింది. ఇప్పటికే మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ వంటి లగ్జరీ బ్రాండ్‌లతో పాటు హ్యుందాయ్, హోండా, స్కోడా వంటి కంపెనీలు కూడా తమ కార్ల ధరలను 2 నుంచి 3 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించాయి. చాలా కంపెనీలు ఇదే బాటలో నడిచే అవకాశం ఉంది. అయితే, ప్రముఖ దేశీయ వాహన తయారీ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా మాత్రం ప్రస్తుతానికి జనవరిలో ధరలు పెంచడం లేదని స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఉత్పత్తి వ్యయాలు పెరిగితేనే పెంపును పరిశీలిస్తామని తెలిపింది. ఈ నేపథ్యంలో కొత్త కారు కొనాలనుకునే వినియోగదారులు ఈ ధరల మార్పులను గమనించాల్సి ఉంటుంది.

# మోదీకి ఒమన్ అత్యున్నత పురస్కారం



దీ ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్‌ను ప్రదానం చేసిన సుల్తాన్

మస్కట్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. ఒమన్ పర్యటనలో ఉన్న ఆయనకు ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'ది ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను సుల్తాన్ హైథమ్ బిన్ తారిక్ గురువారం ప్రదానం చేశారు. గతంలో క్వీన్ ఎలిజబెత్, నెల్సన్ మండేలా వంటి ప్రపంచ ప్రఖ్యాత నేతలకు మాత్రమే ఈ పురస్కారం దక్కింది. రెండు రోజుల క్రితమే ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న మోదీకి ఇది 29వ అంతర్జాతీయ గౌరవం కావడం విశేషం. అంతకుముందు, ప్రధాని మోదీ, ఒమన్ సుల్తాన్ హైథమ్ మధ్య మస్కట్‌లోని అల్ బరకా ప్యాలెస్‌లో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఇరు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం కుదరడాన్ని ఇరువురు నేతలు ఒక కీలక మైలురాయిగా అభివర్ణించారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొన్నారు. భారత్, ఒమన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతుందని నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ 'మైత్రీ పర్వ్' కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే, ఇండియా-ఒమన్ బిజినెస్ ఫోరమ్‌లో పాల్గొని, ఒమన్ వ్యాపారవేత్తలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

# వాయిస్ టు టెక్ట్స్

**భారత వినియోగదారులకు 'ట్రూకాలర్' ఫీచర్**

**తెలుగుతో సహా 12 భారతీయ భాషల్లో ట్రాన్స్‌క్రిప్షన్**

న్యూఢిల్లీ: ప్రముఖ కాలర్ ఐడీ యాప్ ట్రూకాలర్, భారత ఆండ్రాయిడ్ యూజర్ల కోసం ఒక శక్తిమంతమైన, ఉచిత ఏఐ ఫీచర్‌ను గురువారం ప్రారంభించింది. 'ట్రూకాలర్ వాయిస్‌మెయిల్' పేరుతో తీసుకొచ్చిన ఈ కొత్త సదుపాయం ద్వారా యూజర్లు వాయిస్ మెసేజ్‌లను తక్షణమే టెక్ట్స్ గా (ట్రాన్స్‌క్రిప్షన్) మార్చుకోవచ్చు. స్పామ్ కాల్స్‌ను ఆటోమేటిక్‌గా గుర్తించి అడ్డుకునేలా దీనిని రూపొందించారు. సాంప్రదాయ వాయిస్‌మెయిల్స్‌లా కాకుండా, ఈ మెసేజ్‌లు నేరుగా యూజర్ ఫోన్‌లోనే స్టోర్ అవుతాయి. దీనివల్ల రికార్డింగ్‌లపై పూర్తి నియంత్రణ, ప్రైవసీ లభిస్తుంది. పిన్ నంబర్లు గుర్తుపెట్టుకోవడం లేదా ప్రత్యేక నంబర్లకు డయల్ చేయడం వంటి అవసరం ఉండదు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ సహా మొత్తం 12 భారతీయ భాషల్లో వాయిస్‌మెయిల్‌ను టెక్ట్స్ గా మార్చుకునే సౌకర్యం కల్పించారు. దీనివల్ల మీటింగ్‌లో ఉన్నప్పుడు లేదా వినడానికి వీలుకాని పరిస్థితుల్లో వాయిస్‌మెయిల్‌ను సులభంగా చదువుకోవచ్చు. ఈ ఫీచర్‌పై ట్రూకాలర్ సీఈఓ రిషిత్ ఝున్‌ఝున్‌వాలా మాట్లాడుతూ, "సాంప్రదాయ వాయిస్‌మెయిల్ పాత తరం కమ్యూనికేషన్ కోసం రూపొందించబడింది. మేము ఈ విధానాన్ని పూర్తిగా మారుస్తున్నాం. వాయిస్ మెసేజ్‌లను ఉచితంగా, నేరుగా ఫోన్‌లోనే స్టోర్ అయ్యేలా, స్పామ్ ప్రొటెక్షన్‌తో అందిస్తున్నాం. ప్రజలు నేడు కమ్యూనికేట్ చేసే విధానానికి అనుగుణంగా దీనిని తీర్చిదిద్దాం" అని వివరించారు.

# డీఎంకే ఒక దుష్ట శక్తి

**విజయ్ తీవ్ర వ్యాఖ్యలు.. భారీ భద్రత మధ్య ఈరోడ్‌లో సభ**



ఈరోడ్: తమిళనాడు రాజకీయాల్లో వేడి రాజుకుంది. నటుడు, రాజకీయ నాయకుడు విజయ్.. అధికార డీఎంకే ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎంకే ఒక దుష్ట శక్తి అని, తన తమిళగ వెట్రి కళగం (టీవీకే) స్వచ్ఛమైన శక్తి అని వ్యాఖ్యానించారు. ఈరోడ్ జిల్లాలో గురువారం నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. గత సెప్టెంబర్ 27న కరూర్ సభలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన తర్వాత, తమిళనాడులో విజయ్ నిర్వహించిన తొలి భారీ బహిరంగ సభ ఇదే. "నేను మళ్లీ చెబుతున్నా.. డీఎంకే ఒక దుష్ట శక్తి, టీవీకే స్వచ్ఛమైన శక్తి. ఈ పోరాటం ఈ రెండింటి మధ్యే జరుగుతుంది" అని విజయ్ తన ప్రసంగంలో స్పష్టం చేశారు. శాంతిభద్రతలు, నీట్ పరీక్ష మినహాయింపు వంటి అంశాలపై స్టాలిన్ సర్కారును లక్ష్యంగా చేసుకున్నారు. "డీఎంకేకు, సమస్యలకు ఫెవికాల్‌తో అంటించినంత సంబంధం ఉంది. వాటిని వేరు చేయలేం" అంటూ ఎద్దేవా చేశారు. సభ ముగిశాక ప్రజలందరూ సురక్షితంగా ఇళ్లకు వెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సభకు రాజకీయంగానూ ప్రాధాన్యత ఏర్పడింది. ఇటీవల అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురై టీవీకేలో చేరిన సీనియర్ నేత, ఎన్నికల వ్యూహకర్త కేఏ సెంగొట్టయ్యన్ సొంత ప్రాంతమైన విజయమంగళం సమీపంలో ఈ సభను నిర్వహించడం గమనార్హం. ద్రవిడ ఉద్యమాలకు బలమైన పట్టున్న పశ్చిమ తమిళనాడులో తన ఉనికిని చాటుకునేందుకు విజయ్ ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. కరూర్ విషాదం పునరావృతం కాకుండా ఈ సభకు పోలీసులు కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. సుమారు 35,000 మంది హాజరవుతారని అంచనా వేసి, 1300 మందికి పైగా పోలీసులను మోహరించారు. సభా ప్రాంగణాన్ని 72 బాక్సులుగా విభజించి, ఒక్కో బాక్సులో 500 మందికి మించి ఉండకుండా చర్యలు తీసుకున్నారు. గర్భిణులు, చిన్న పిల్లలతో వచ్చే వారికి అనుమతి నిరాకరించారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పోటీ చేయనుంది. ఎంజీఆర్, జయలలిత మాదిరిగా రాజకీయాల్లో విజయం సాధించాలని విజయ్ భావిస్తున్నప్పటికీ, దశాబ్దాలుగా పాతుకుపోయిన డీఎంకే, అన్నాడీఎంకేల ఆధిపత్యాన్ని అధిగమించడం ఆయనకు పెద్ద సవాలుగా మారనుంది.

# గాజాకు పాక్ సైనిక దళాలు

**పాక్‌పై అమెరికా ఒత్తిడి**



గాజా: గాజాకు శాంతి పరిరక్షక దళాలను పంపాలన్న అమెరికా ప్రతిపాదన పాకిస్థాన్ సర్వశక్తిమంతమైన రక్షణ దళాల అధిపతి ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌ను తీవ్ర ఇరకాటంలోకి నెట్టింది. ఒకవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి తీవ్ర ఒత్తిడి వస్తుండగా, మరోవైపు ఈ నిర్ణయం తీసుకుంటే స్వదేశంలో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుంది. దీంతో ఇది మునీర్ కు కత్తి మీద సాము లాంటి పరిస్థితిని తెచ్చిందని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. రాయిటర్స్ కథనం ప్రకారం ఈ విషయంపై చర్చించేందుకు అసిమ్ మునీర్ త్వరలో వాషింగ్టన్ వెళ్లి ట్రంప్‌తో సమావేశం కానున్నారు. గత ఆరు నెలల్లో వీరిద్దరి మధ్య ఇది మూడో భేటీ కానుంది. ఇజ్రాయెల్ దళాలు వెనక్కి వెళ్లాక, గాజా పునర్నిర్మాణం, ఆర్థిక పునరుద్ధరణ కోసం ముస్లిం దేశాల సైన్యాన్ని మోహరించాలన్నది ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల ప్రణాళికలో కీలక అంశం. అయితే, హమాస్‌ను నిరాయుధులను చేసే ఈ ప్రక్రియలో పాల్గొంటే వివాదంలో చిక్కుకోవాల్సి వస్తుందని, ఇజ్రాయెల్ వ్యతిరేక, పాలస్తీనా అనుకూల ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని అనేక దేశాలు భయపడుతున్నాయి. పాకిస్థాన్ ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తే, అమెరికాతో కష్టపడి మెరుగుపరుచుకున్న సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. అమెరికా పెట్టుబడులు, భద్రతా సహాయం కోసం పాకిస్థాన్ ఎదురుచూస్తున్న తరుణంలో ట్రంప్‌కు కోపం తెప్పించే సాహసం చేయకపోవచ్చని వాషింగ్టన్‌లోని అట్లాంటిక్ కౌన్సిల్ సీనియర్ ఫెలో మైఖేల్ కుగెల్‌మాన్ అభిప్రాయపడ్డారు. మరోవైపు దేశంలో ఇస్లామిక్ పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశం ఉంది. అమెరికా, ఇజ్రాయెల్‌లకు వ్యతిరేకంగా వేలాది మందిని సమీకరించే శక్తి ఈ పార్టీలకు ఉంది. "అసిమ్ మునీర్ ఇజ్రాయెల్ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారు" అనే ప్రచారం మొదలైతే పరిస్థితి తీవ్రంగా మారుతుందని రక్షణ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ మాట్లాడుతూ.. శాంతి పరిరక్షణకు సైన్యాన్ని పంపడాన్ని పరిశీలించవచ్చని, కానీ హమాస్‌ను నిరాయుధులను చేయడం తమ పని కాదని గత నెలలో స్పష్టం చేశారు. అయితే, ఇటీవలే 2030 వరకు పదవీకాలం పొడిగింపు, జీవితకాలం నేర విచారణ నుంచి మినహాయింపు వంటి అధికారాలతో పాక్‌లో అత్యంత శక్తిమంతంగా మారిన మునీర్ నిర్ణయమే అంతిమంగా ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు.



# పది నెలల్లో 8 యుద్ధాలు ఆపా: ట్రంప్

వాషింగ్టన్: తాను అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఎనిమిది యుద్ధాలను ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. టారిఫ్‌ల (సుంకాలు) వల్లే ఇది సాధ్యమైందని, ఇంగ్లిష్‌లో తనకు అత్యంత ఇష్టమైన పదం కూడా అదేనని పునరుద్ఘాటించారు. తన ముందు అధ్యక్షుడిగా ఉన్న జో బైడెన్ దేశాన్ని గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టి తన చేతుల్లో పెట్టారని ఆయన తీవ్రంగా విమర్శించారు. దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన 79 ఏళ్ల ట్రంప్ తన ప్రభుత్వ 2026 ఎజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నేను అమెరికా బలాన్ని పునరుద్ధరించాను. పది నెలల్లో ఎనిమిది యుద్ధాలను పరిష్కరించాను. ఇరాన్ అణు ముప్పును నాశనం చేశాను. గాజాలో యుద్ధాన్ని ముగించి మూడు వేల ఏళ్లలో తొలిసారిగా శాంతిని తీసుకొచ్చాను. బందీలను సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చాను" అని చెప్పుకొచ్చారు. ట్రంప్ వాణిజ్య విధానాల వల్ల అమెరికాలో ధరలు ఆకాశాన్నంటుతున్నప్పటికీ ద్రవ్యోల్బణం గురించి ఆయన ప్రస్తావించలేదు. కెనడా, మెక్సికో, భారత్ వంటి దేశాలపై విధించిన టారిఫ్‌ల వల్లే అమెరికా ఆర్థిక వ్యవస్థకు మేలు జరిగిందని సమర్థించుకున్నారు. "టారిఫ్‌ల వల్ల మేం అనుకున్నదానికంటే చాలా ఎక్కువ డబ్బు సంపాదించాం" అని తెలిపారు.

# స్టాట్యూ ఆఫ్ యూనిటీ రూపశిల్పి కన్నుమూత

అహ్మదాబాద్: ప్రఖ్యాత భారతీయ శిల్పి, పద్మభూషణ్ పురస్కార గ్రహీత రామ్ వి. సుతార్ (100) కన్నుమూశారు. వయోభారంతో బాధపడుతున్న ఆయన నోయిడాలోని తన కుమారుడి నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గుజరాత్‌లోని ప్రపంచ ప్రసిద్ధ 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ', హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై కొలువుదీరిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారీ విగ్రహాలకు రూపకల్పన చేసింది రామ్ సుతార్ కావడం విశేషం. 1925 ఫిబ్రవరి 19న మహారాష్ట్రలోని గోందూర్ గ్రామంలో ఒక సాధారణ విశ్వకర్మ కుటుంబంలో రామ్ సుతార్ జన్మించారు. తన అద్భుతమైన ప్రతిభతో శిల్పకళా రంగంలో శిఖరాలను అధిరోహించారు. ఆయన రూపొందించిన అనేక కళాఖండాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ముఖ్యంగా గుజరాత్‌లోని నర్మదా నదీ తీరంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ గౌరవార్థం నిర్మించిన 182 మీటర్ల 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' విగ్రహం ఆయనకు ప్రపంచవ్యాప్త ఖ్యాతిని తెచ్చిపెట్టింది. అదేవిధంగా, హైదరాబాద్ నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 125 అడుగుల అంబేద్కర్ మహా విగ్రహాన్ని కూడా రామ్ సుతార్ తీర్చిదిద్దారు. శిల్పకళా రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1999లో పద్మశ్రీ, 2016లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ, కళారంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# పాక్‌లో 'ధురంధర్' బ్యాన్

**కానీ, బిలావల్ హాజరైన పార్టీలో అదే పాట**

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ప్రభుత్వం నిషేధించిన భారతీయ గూఢచారి థ్రిల్లర్ మూవీ 'ధురంధర్' అక్కడ అనూహ్యమైన ప్రజాదరణ పొందుతోంది. ఈ సినిమా పాక్‌కు వ్యతిరేకంగా ఉందంటూ కొందరు రాజకీయ నాయకులు కేసులు పెడుతుండగా, అందులోని 'ఏఫ్ఏ9ఎల్ఏ' అనే పాట మాత్రం దేశవ్యాప్తంగా పార్టీలలో మారుమోగిపోతోంది. తాజాగా, ఈ పాటకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) అధినేత బిలావల్ భుట్టో హాజరైన ఓ పార్టీలో 'ధురంధర్' సినిమాలోని 'ఫస్లా' పాటను ప్లే చేశారు. వీడియోలో, బిలావల్ వేదికపైకి వచ్చి కూర్చుంటుండగా నేపథ్యంలో ఈ పాట వినిపించింది. బహ్రెయిన్ కళాకారుడు నవాఫ్ ఫహద్ ఆలపించిన ఈ పాట, సినిమాలో అక్షయ్ ఖన్నా పోషించిన రెహ్మాన్ అనే డాన్ పాత్రతో ముడిపడి ఉంది. విచిత్రం ఏమిటంటే, ఈ సినిమాలో తమ నాయకురాలు బెనజీర్ భుట్టో చిత్రాలను ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ బిలావల్ భుట్టోకు చెందిన పీపీపీ పార్టీనే కరాచీ కోర్టులో కేసు దాఖలు చేసింది. సినిమా నటీనటులు, సిబ్బందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పిటిషన్‌లో కోరింది. 1999 నాటి కాందహార్ హైజాక్, 26/11 ముంబై దాడులు, ల్యారీ గ్యాంగ్ వార్స్ వంటి అంశాలతో తెరకెక్కిన ఈ చిత్రంపై పాకిస్థాన్‌తో పాటు కొన్ని గల్ఫ్ దేశాలు నిషేధం విధించాయి. అయినప్పటికీ, డిజిటల్ స్పేస్‌పై పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ పట్టు కోల్పోవడంతో పైరసీని అడ్డుకోలేకపోయింది. కేవలం రెండు వారాల్లోనే పాక్‌లో ఈ సినిమాను 20 లక్షల మందికి పైగా అక్రమంగా డౌన్‌లోడ్ చేసుకున్నారు. దీంతో అక్కడ అత్యధికంగా పైరసీకి గురైన చిత్రంగా 'ధురంధర్' నిలిచింది. ఈ సినిమా ద్వారా తమ దేశాన్ని ఉగ్రవాద దేశంగా చిత్రీకరించారని పాకిస్థానీలు ఆరోపిస్తున్నారు.

# బంగ్లాదేశ్‌లో భారత్ వీసా కేంద్రాల మూసివేత

ఢాకా: బంగ్లాదేశ్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని ముట్టడించేందుకు కొందరు ప్రయత్నించిన నేపథ్యంలో, భద్రతా కారణాల దృష్ట్యా భారత్ అక్కడి రెండు వీసా కేంద్రాలను తాత్కాలికంగా మూసివేసింది. ఢాకాలోని వీసా కేంద్రాన్ని ఇంతకుముందు మూసివేసినప్పటికీ, దానిని తిరిగి తెరిచినట్లు సమాచారం. భద్రతాపరమైన కారణాల దృష్ట్యా రాజ్‌షాహి, ఖుల్నాలలోని భారత వీసా కేంద్రాలను మూసివేస్తున్నట్లు బంగ్లాదేశ్‌లోని ఇండియన్ వీసా అప్లికేషన్ సెంటర్ ప్రకటించింది. గురువారం షెడ్యూల్ అయిన అపాయింట్‌మెంట్లకు మరో తేదీని కేటాయిస్తామని స్పష్టం చేసింది. బంగ్లాదేశ్‌లో ఢాకా, రాజ్‌షాహి, ఖుల్నాల, చత్తోగ్రామ్, సిల్‌హెత్ నగరాల్లో ఐదు వీసా కేంద్రాలు కొనసాగుతున్నాయి.

# బీజేపీకి ఏ టీంలా ఒమర్ అబ్దుల్లా

**పీపుల్స్ కాన్ఫరెన్స్ ఎమ్మెల్యే విమర్శలు**

శ్రీనగర్: జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాపై పీపుల్స్ కాన్ఫరెన్స్ చీఫ్, ఎమ్మెల్యే సజాద్ గని తీవ్ర విమర్శలు గుప్పించారు. 2024 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒమర్ ఇతర పార్టీలను బీజేపీ ఏజెంట్లుగా ముద్ర వేశారని, గెలిచిన తర్వాత ఆయన ఆ పార్టీకి 'ఏ' టీమ్‌లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా విమర్శలు చేశారు. ప్రతి ఒక్కరిని బీజేపీ ఏజెంట్లుగా ముద్ర వేసి ఎన్నికల్లో గెలిచిన ఒమర్ అబ్దుల్లా, ఇప్పుడు అదే పార్టీతో కలిసి సాగుతున్నారని మండిపడ్డారు. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ బీజేపీతో పోరాడుతుందని భావించిన కశ్మీరీలందరికీ ఇది ఒక గుణపాఠమని అన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్‌పై ఈ ముఖ్యమంత్రి ప్రతిరోజు విమర్శలు చేస్తున్నారని, కానీ ఆ లెఫ్టినెంట్ గవర్నర్‌ను పంపించింది ప్రధానమంత్రి కాదా అని నిలదీశారు. సిన్హాను లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమించిన ప్రధానమంత్రికి వ్యతిరేకంగా ఒమర్ అబ్దుల్లా ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని అన్నారు. జమ్ము కశ్మీర్‌లో అధికారమంతా లెఫ్టినెంట్ గవర్నర్ చేతిలోనే ఉందని ముఖ్యమంత్రి, ఆయన మంత్రులు నిత్యం చెబుతున్నారని గుర్తు చేశారు.

# యువతిపై భారత సంతతి డ్రైవర్ రేప్

కాలిఫోర్నియా: అమెరికాలో భారత సంతతికి చెందిన ఓ క్యాబ్ డ్రైవర్ దారుణానికి పాల్పడ్డాడు. మద్యం మత్తులో స్పృహలో లేకుండా ఉన్న ఓ యువతిపై అత్యాచారం చేశాడన్న ఆరోపణలతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. కాలిఫోర్నియాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెంచురా కౌంటీ షెరీఫ్ కార్యాలయం వెల్లడించిన వివరాల ప్రకారం.. బేకర్స్‌ఫీల్డ్‌కు చెందిన సిమ్రన్‌జిత్ సింగ్ సెఖోన్ (35) క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నవంబర్ 27న తెల్లవారుజామున 1 గంట సమయంలో 21 ఏళ్ల యువతి థౌజండ్ ఓక్స్‌లోని ఓ బార్ నుంచి కమరిల్లోలోని తన ఇంటికి వెళ్లేందుకు క్యాబ్ బుక్ చేసుకుంది. అప్పటికే ఆమె తీవ్రమైన మత్తులో ఉంది. మార్గమధ్యంలో నిద్రలోకి జారుకున్న ఆమెను గమ్యస్థానానికి చేర్చాల్సిన సెఖోన్, ట్రిప్ పూర్తయినట్లు యాప్‌లో చూపించాడు. ఆ తర్వాత, స్పృహలో లేని ఆమెను కమరిల్లో వీధుల్లో కారులో తిప్పుతూ లైంగిక దాడికి పాల్పడ్డాడని దర్యాప్తు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై నవంబర్‌లో కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ఈ నెల 15న నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, తాను నేరం చేయలేదని వాదించాడు. కోర్టు అతనికి 5 లక్షల డాలర్ల పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేసింది. తదుపరి విచారణ ఈ నెల 29న జరగనుంది. అయితే, సెఖోన్ ఏ రైడ్‌షేర్ సంస్థ తరఫున పనిచేస్తున్నాడనే విషయాన్ని పోలీసులు వెల్లడించలేదు. ఈ ఘటన నేపథ్యంలో నిందితుడి వల్ల ఇంకా ఎవరైనా బాధింపబడి ఉండే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు.



# నష్టాల్లో మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు కూడా నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. అమ్మకాల ఒత్తిడితో సూచీలు పతనమవుతున్నాయి. అయితే ఈ ప్రతికూల పరిస్థితుల్లోనూ ఇటీవల లిస్టయిన మీషో లిమిటెడ్ షేరు మాత్రం అద్భుతంగా రాణిస్తోంది. ఇవాళ్టి ట్రేడింగ్‌లో ఏకంగా 16 శాతం పెరిగి సరికొత్త రికార్డు సృష్టించింది. ఇంట్రాడేలో ఈ షేరు రూ. 254.40 వద్ద ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయిని తాకింది. డిసెంబర్ 10న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయిన ఈ కంపెనీ, కేవలం 7 ట్రేడింగ్ సెషన్లలోనే 130 శాతం రాబడిని అందించి ఇన్వెస్టర్లకు లాభాల పంట పండించింది. మీషో ఐపీఓ ఇష్యూ ధర రూ. 111 కాగా, ఎన్ఎస్ఈలో 46 శాతం ప్రీమియంతో రూ. 162.50 వద్ద లిస్ట్ అయింది. అప్పటి నుంచి వరుసగా అప్పర్ సర్క్యూట్లతో దూసుకుపోతోంది. ఈ ఐపీఓకు ఇన్వెస్టర్ల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఏకంగా 79 రెట్ల అధికంగా సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. ప్రస్తుతం కంపెనీ మార్కెట్ విలువ రూ. 1.05 లక్షల కోట్లు దాటింది. పలు బ్రోకరేజీ సంస్థలు ఈ స్టాక్‌పై పాజిటివ్‌గా స్పందిస్తూ టార్గెట్ ధరను పెంచడంతో, కొనుగోళ్లకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారు. ఇదిలా ఉండగా, గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి సెన్సెక్స్ 150 పాయింట్ల నష్టంతో 84,400 వద్ద, నిఫ్టీ 30 పాయింట్ల నష్టంతో 25,800 దిగువన ట్రేడవుతున్నాయి.

ఈవార్తలు
# వినోదవాణి CINEMA
శుక్రవారం 19-12-2025 www.evarthalu.com


## వయ్యారి చిత్రం



నిధి అగర్వాల్



## భార్యతో షిజు విడాకులు

సినిమా ఇండస్ట్రీలో ప్రేమలు, పెళ్లిళ్లు, విడాకులు ఇప్పుడు కొత్తేమీ కాదు. కొంతమంది సెలబ్రిటీలు పెళ్లి చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభిస్తే, మరి కొంతమంది ఆరు నెలలకే వైవాహిక బంధానికి వీడ్కోలు పలుకుతున్నారు. ఇంకొందరు ఏళ్ల తరబడి కలిసి జీవించి, పిల్లలు పుట్టిన తర్వాత కూడా సడన్‌గా విడాకులు తీసుకుని అభిమానులను ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు. ఇప్పుడు అలాంటి జాబితాలోకి మరో నటుడు చేరారు. టాలీవుడ్, మలయాళ చిత్ర పరిశ్రమలకు చెందిన నటుడు షిజు ఏఆర్ తన 17 ఏళ్ల వైవాహిక బంధానికి స్వస్తి పలికారు. ఈ విషయాన్ని ఆయనే తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించడం గమనార్హం. ఆయన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. షిజు తన ప్రకటనలో, నేను, ప్రీతి ప్రేమ్ పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయం తీసుకున్నాం. మాకు అధికారికంగా విడాకులు మంజూరయ్యాయి. భార్యాభర్తలుగా విడిపోయినా, మంచి స్నేహితులుగా కొనసాగుతున్నాం. మా వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను. దయచేసి ఎలాంటి పుకార్లు సృష్టించవద్దు" అని పేర్కొన్నారు. మలయాళ నటుడిగా కెరీర్ ప్రారంభించిన షిజు ఏఆర్, తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితుడే. ముఖ్యంగా 'దేవి' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన, ఆ తర్వాత అనేక తెలుగు చిత్రాల్లో కీలక పాత్రలు పోషిస్తూ అభిమానులను ఆకట్టుకున్నారు. ప్రస్తుతం కూడా పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న సమయంలోనే ఈ విడాకుల వార్త బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది.



## వారణాసికి బాలయ్య

బోయపాటి శ్రీను దర్శకత్వంలో బాలయ్య నటించిన అఖండ 2 తాండవం రిలీజ్ అయ్యి వారం పూర్తి కానుంది. తాజాగా వీరిద్దరు వారణాసి వెళ్లారు. అక్కడ ఎయిర్ పోర్టులో వారిద్దరూ కనిపించిన దృశ్యాలు.. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అయితే అఖండ 2 టీమ్.. ఇప్పుడు బాలీవుడ్ పోస్ట్ ప్రమోషన్స్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే ఇప్పుడు వారణాసిలోని అఘోరాలను కలిసేందుకు బోయపాటి, బాలయ్య వెళ్లినట్లు సమాచారం. వారిని కలిసి దాన్ని సినిమాకు ప్రమోషన్ గా యూజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అదే సమయంలో శుక్రవారం రిలీజ్ కానున్న అవతార్ 3 ప్రీ రివ్యూస్ వీక్ గా ఉండడంతో నార్త్ లో మళ్లీ అఖండ 2ను పెద్ద ఎత్తున ప్రమోట్ చేయడం ద్వారా దాన్ని క్యాష్ చేసుకోవాలని ప్లాన్ లో ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతుంది.




## అవతార్ 3 నేడే విడుదల

ప్రముఖ హాలీవుడ్ దర్శక దిగ్గజం జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన చిత్రాలలో అవతార్ ప్రపంచ స్థాయి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు దీని మూడో భాగం ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. శుక్రవారం ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో సినిమా గురించి తన అభిప్రాయాన్ని రివ్యూ రూపంలో పంచుకున్నారు టాలీవుడ్ డైరెక్టర్ సుకుమార్. ఈ స్టోరీ గురించి సుకుమార్ మాట్లాడుతూ.. '3.17 గంటలు నాకు క్షణాల అయిపోయాయి. నేను పండోరా ప్రపంచానికి వెళ్ళిపోయాను. కచ్చితంగా బ్లాక్ బస్టర్ అవుతుంది. తెలుగు సినిమాల్లో ఉండే ఎమోషన్స్ అన్ని ఇందులో ఉన్నాయి. ముఖ్యంగా విజువల్స్ , పాత్రలు నా మైండ్ నుంచి ఇంకా వెళ్ళలేదు. ముఖ్యంగా ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలకు నా కళ్ళల్లో నీళ్లు వచ్చాయి. ఇది థియేటర్లలోనే చూడాల్సిన సినిమా' అంటూ సినిమాపై అంచనాలు పెంచేశారు.

## 20 ఏళ్ల చిన్నోడితో డేటింగ్!



అర్బాజ్ ఖాన్‌తో విడాకులు, అర్జున్ కపూర్‌తో డేటింగ్ సాగించిన మలైకా అరోరా (52).. ఇప్పుడు మరో యువ వ్యాపారితో ప్రేమలో పడినట్లు తెలుస్తోంది. ముంబైకి చెందిన 32 ఏళ్ల డైమండ్ వ్యాపారి హర్ష్ మెహతాతో డేటింగ్ చేస్తున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. రీసెంట్ గా ఇద్దరూ పలుమార్లు కలిసి కనిపించడం హాట్ టాపిక్ గా మారింది. పలు ప్రత్యేక కార్యక్రమాలతోపాటు ఇటీవల ముంబై విమానాశ్రయంలో కూడా వారిద్దరూ కలిసి కనిపించడంతో పుకార్లకు ఆజ్యం పోసినట్లయింది. త్వరలోనే వారిద్దరూ పెళ్లి కూడా చేసుకోనున్నారని సోషల్ మీడియాలో పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి.



## ముద్దు ఇవ్వకుండా ఉండాల్సింది : మాధురి దీక్షిత్

బాలీవుడ్ సీనియర్ నటి మాధురిదీక్షిత్ తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న ఒక బాధాకరమైన అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. 1988లో విడుదలైన 'దయావన్' సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఒక ముద్దు సీన్ తనను ఎంతగా కలచివేసిందో ఆమె ఓపెన్‌గా చెప్పారు. ఆ సినిమాలో ఆమె సీనియర్ నటుడు వినోద్ ఖన్నాతో కలిసి నటించారు. అప్పట్లో మాధురీ కొత్త నటి కాగా.. వినోద్ ఖన్నా ఇండస్ట్రీలో చాలా పవర్‌ఫుల్ స్టార్. 'ఆజ్ ఫిర్ తుమ్పే ప్యార్ ఆయా హై' అనే పాటలో ఒక రొమాంటిక్.. ముద్దు సీన్ ఉంటుంది. ఆ సినిమాలోని ఆ సీన్ నాకు ఒక గుణపాఠంలా నిలిచింది. ఆ సీన్ తర్వాత నేను చాలా ఇబ్బంది పడ్డాను. ఇకపై ఇలాంటి సన్నివేశాలు చేయకూడదని అప్పుడే నిర్ణయించుకున్నాను" అని చెప్పారు. ఆ సీన్ షూటింగ్ తర్వాత ఆమె చాలా ఎమోషనల్ అయ్యారని.. కన్నీళ్లు కూడా పెట్టుకున్నారని అప్పట్లో వార్తలు వచ్చాయి.



## అల్లు అర్జున్ అంటే ఇష్టం

మలయాళ బ్యూటీ అనశ్వర రాజన్ డిసెంబర్ 25న విడుదల కానున్న ఛాంపియన్ అనే సినిమాలో రోషన్ మేక సరసన నటిస్తోంది. ఈ సినిమా ద్వారానే తెలుగు తెరకు పరిచయం కాబోతోంది. అలాగే వెంకీ కుడుముల నిర్మించిన మరో తెలుగు చిత్రం ఇట్లు అర్జున అనే సినిమాలో కూడా కొత్త అనీష్ సరసన ఈమె నటించడానికి సైన్ చేసింది. ఈ రెండు తెలుగు భారీ ప్రాజెక్టులు ఈమె చేతిలో ఉండడంతో హైదరాబాదులోనే ఎక్కువ సమయాన్ని గడుపుతోంది. ఈ క్రమంలోనే తెలుగు సినిమా పట్ల అలాగే హైదరాబాదు సంస్కృతి పట్ల తన అభిమానాన్ని పంచుకుంది. హైదరాబాద్ బిర్యానీ అంటే తనకు చాలా ఇష్టం అని చెప్పిన ఈమె.. హైదరాబాదు రుచులను పూర్తిగా ఆస్వాదిస్తున్నాను అంటూ తెలిపింది. సెలబ్రిటీల గురించి మాట్లాడుతూ.. 'రామ్ చరణ్ మగధీర సినిమాను లెక్కలేనన్నిసార్లు చూశాను. ముఖ్యంగా తెలుగు నటులలో నాకు అల్లు అర్జున్ అంటే చాలా ఇష్టం' అంటూ తెలిపింది అనశ్వర రాజన్. ప్రస్తుతం ఈమె చేసిన ఈ కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.




# చేతులెత్తేసిన ఇంగ్లండ్

## పట్టుబిగించిన ఆసీస్

ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో భాగంగా అడిలైడ్ వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్‌లోనూ ఆస్ట్రేలియా పట్టుబిగించింది. ముందుగా బ్యాటింగ్‌లో సత్తా చాటిన ఆసీస్.. ఆ తర్వాత బౌలింగ్‌లోనూ చెలరేగింది. దాంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 68 ఓవర్లలో 8 వికెట్లకు 213 పరుగులు చేసింది. కెప్టెన్ బెన్ స్టోక్స్(45 బ్యాటింగ్)తో పాటు జోఫ్రా ఆర్చర్(30 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. హ్యారీ బ్రూక్(45) పర్వాలేదనిపించగా.. మిగతా బ్యాటర్లు నిరాశపర్చారు. ఆసీస్ బౌలర్లలో ప్యాట్ కమిన్స్ మూడు వికెట్లు తీయగా.. స్కాట్ బోలాండ్, నాథన్ లయన్ రెండేసి వికెట్లు తీసారు. కామెరూన్ గ్రీన్‌కు ఒక వికెట్ దక్కింది. అంతకుముందు 326/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్.. 91.2 ఓవర్లలో 371 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో అలెక్స్ క్యారీ(106) త్వరగానే ఔటవ్వగా.. మిచెల్ స్టార్క్(54) హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. నాథన్ లయన్(9) విఫలమవ్వగా.. స్కాట్ బోలాండ్(14 నాటౌట్) అజేయంగా నిలిచాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్(5/53) ఐదు వికెట్లు తీయగా.. బ్రైడన్ కార్స్, విల్ జాక్స్ రెండేసి వికెట్లు పడగొట్టారు. జోష్ టంగ్‌కు ఓ వికెట్ దక్కింది. ఇంగ్లండ్ ఇంకా 158 పరుగుల వెనుకంజలో ఉంది. అద్భుతం జరిగితే తప్పా ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ పుంజుకునే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పటికే ఈ సిరీస్‌లో ఇంగ్లండ్ 0–2తో వెనుకంజలో నిలిచింది.

## ఆసీస్ తొండాట




ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో భాగంగా అడిలైడ్ వేదికగా ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న మూడో టెస్ట్‌లో డీఆర్ఎస్ విషయంలో తీవ్ర దుమారం రేగింది. సాంకేతిక లోపం కారణంగా ఆస్ట్రేలియా బ్యాటర్ అలెక్స్ క్యారీ ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న అతను ఏకంగా శతకంతో చెలరేగాడు. ఇది ఇంగ్లండ్ జట్టుకు తీవ్ర నష్టం చేసింది. అలెక్స్ క్యారీ సెంచరీతో తొలి రోజు ఆటలో ఆసీస్ ఆధిపత్యం చెలాయించింది. మొదటి రోజు ఆట అనంతరం అలెక్స్ క్యారీ డీఆర్ఎస్ వివాదాంపై స్పందించాడు. తాను ఔటయ్యాననే విషయం తెలుసని, అంపైర్ నాటౌట్ ఇవ్వడంతో బ్యాటింగ్ కొనసాగించి సెంచరీ సాధించానని చెప్పాడు.




## మెక్‌గ్రాత్‌ను వెనక్కి నెట్టిన లయన్

ఆస్ట్రేలియా వెటరన్ స్పిన్నర్ నాథన్ లయన్ టెస్ట్ క్రికెట్‌లో ఓ అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడో యాషెస్ టెస్టులో నాథన్ లయన్ అద్భుత ప్రదర్శన చేస్తూ ఆస్ట్రేలియా దిగ్గజ ఫాస్ట్ బౌలర్ గ్లెన్ మెక్‌గ్రాత్‌ను అధిగమించాడు. టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో నాథన్ లయన్ ఇప్పుడు ఆరో స్థానానికి చేరుకున్నారు. గురువారం నాటి ఆటలో నాథన్ లయన్ రెండు కీలక వికెట్లు తీయడం ద్వారా తన కెరీర్ టెస్ట్ వికెట్ల సంఖ్యను 564కి చేర్చుకున్నారు. తద్వారా 563 వికెట్లు తీసిన మెక్‌గ్రాత్‌ను వెనక్కి నెట్టారు. ఇంగ్లాండ్ బ్యాటర్లు ఓలీ పోప్, బెన్ డకెట్‌లను స్వల్ప వ్యవధిలో ఔట్ చేయడం ద్వారా నాథన్ లయన్ ఈ ఘనత సాధించారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా తరఫున అత్యధిక టెస్టు వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో ఆసీస్ దిగ్గజం షేన్ వార్న్(708) తర్వాత లయన్ రెండో స్థానంలో నిలిచారు. నాథన్ లయన్ తన రికార్డును అధిగమించగానే కామెంటరీ బాక్సులో ఉన్న గ్లెన్ మెక్‌గ్రాత్ ఇచ్చిన రియాక్షన్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. తన రికార్డు బ్రేక్ అయినందుకు సరదాగా కోపం నటిస్తూ.. అక్కడే ఉన్న ఒక కుర్చీని విసిరేయబోతున్నట్లు మెక్‌గ్రాత్ సైగ చేశాడు. ఆ తర్వాత వెంటనే నవ్వుతూ నాథన్ లయన్‌ను అభినందించారు.

## ఫ్యాన్స్‌పై కోప్పడుతున్నారు!

**నిన్న కోహ్లీ.. నేడు బుమ్రా**

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా సహనం కోల్పోయాడు. ఓ అభిమాని అత్యుత్సాహంతో జస్‌ప్రీత్ బుమ్రాకు కోపం తెప్పించాడు. అనుమతి లేకుండా సెల్ఫీ వీడియో తీయడంతో చికాకు గురైన బుమ్రా అతని ఫోన్ లాగిపడేసాడు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. బుమ్రాతో పాటు సదరు అభిమానిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎయిర్‌పోర్ట్‌లో బుమ్రాను చేసిన ఓ అభిమాని అతని అనుమతి లేకుండా సెల్ఫీ వీడియో తీసాడు. ఇది గమనించిన బుమ్రా వద్దని హెచ్చరించాడు. అయినా ఆ అభిమాని పట్టించుకోకుండా సెల్ఫీ తీసాడు. దాంతో తీవ్ర అసహనానికి గురైన బుమ్రా ఫోన్ లాక్కున్నాడు. ఆ తర్వాత ఏం జరిగిందనేదానిపై క్లారిటీ లేదు. అయితే ఈ ఘటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బుమ్రాకు అంత కోపం ఎందుకని కొందరంటే మరికొందరు మాత్రం అభిమానిని తిడుతున్నారు. బుమ్రాను చూసిన ఆ ఆనందంలో సదరు అభిమాని అలా చేశాడని, దానికే అంతా సీరియస్ అవ్వాల్సిన అవసరం ఏం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



## గాలి కాలుష్యం వల్లే మ్యాచ్ రద్దు

### యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్

భారత్, సౌతాఫ్రికా మధ్య నాలుగో టీ20 రద్దుకు పొగ మంచు కారణం కాదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖేల్ యాదవ్ అన్నారు. గాలి కాలుష్యం వల్లే మ్యాచ్ రద్దయ్యిందని చెప్పారు. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా లక్నో వేదికగా బుధవారం జరగాల్సిన మ్యాచ్ పొగమంచు కారణంగా రద్దయిన సంగతి తెలిసిందే. టాస్ సమయానికే మైదానాన్ని పొగమంచు కమ్మేయడంతో పలు మార్లు మైదానాన్ని పరిశీలించి, విజిబిలిటిని పరీక్షించిన అంపైర్లు చివరకు మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఈ వ్యవహారంపై స్పందించిన అఖిలేష్ యాదవ్.. బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఢిల్లీ కాలుష్యం లక్నోకు చేరడంతోనే మ్యాచ్ రద్దయ్యిందని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. 'ఢిల్లీ కాలుష్యం ఇప్పుడు లక్నోకు చేరుకుంది. అందుకే లక్నోలో జరగాల్సిన అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ రద్దయ్యింది. ఈ మ్యాచ్ రద్దుకు మంచు కారణం కాదు. విషపూరితమైన గాలి కాలుష్యం. లక్నోలో స్వచ్ఛమైన గాలి కోసం మేం ఏర్పాటు చేసిన పార్కులను కూడా బీజేపీ నాశనం చేసింది. పార్కుల్లో అనవసరమైన కార్యక్రమాలు నిర్వహించి వాటిని దెబ్బతీసింది. మానవులతో పర్యవరణానికి బీజేపీ శ్రేయస్కారం కాదు. లక్నోలో ఉంటే మాస్క్ ధరించండి'అని అఖిలేష్ యాదవ్ ట్వీట్ చేశారు. పొగమంచుతో పాటు మైదానం గాలి నాణ్యత దారుణంగా పడిపోవడంతో టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మాస్క్ ధరించి కనిపించాడు. కాసేపు మైదానంలో ప్రాక్టీస్ చేసిన భారత ఆటగాళ్లు ఆ తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌కు పరిమితమయ్యారు. రాత్రి 9.30 గంటలకు చివరిసారిగా మైదాన్ని పరిశీలించిన అంపైర్లు.. మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మ్యాచ్ రద్దవ్వడంపై ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీసీసీఐపై మండిపడుతున్నారు. పొగమంచు కురిసే ప్రదేశాల్లో మ్యాచ్‌లు ఎందుకని, సౌత్ ఇండియాలో చాలా మైదానాలు అనుకూలంగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ టికెట్ డబ్బులు రిటర్న్ చేయాలని ప్రేక్షకులు కోరుతున్నారు. ఈ ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2–1తో ఆధిక్యంలో కొనసాగుతుంది. ఆఖరి మ్యాచ్ శుక్రవారం అహ్మదాబాద్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్ గెలిచి సిరీస్ కైవసం చేసుకోవాలనే పట్టుదలతో భారత్ ఉంది.


## అంపైర్లకు బుద్ధి లేదు: ఊతప్ప



అంపైర్ల అనాలోచిత నిర్ణయం కారణంగానే భారత్, సౌతాఫ్రికా నాలుగో టీ20 రద్దయ్యిందని మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ మ్యాచ్ సందర్భంగా అంపైర్లు ఇంకిత జ్ఞానం లేకుండా వ్యవహరించారని మండిపడ్డాడు. బుధవారం లక్నో వేదికగా జరగాల్సిన ఈ మ్యాచ్ విపరీతమైన పొగమంచు కారణంగా రద్దయిన సంగతి తెలిసిందే. టాస్ సమయానికే మైదానాన్ని పొగమంచు కమ్మేయడంతో పలు మార్లు మైదానాన్ని పరిశీలించి, విజిబిలిటిని పరీక్షించిన అంపైర్లు చివరకు మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మ్యాచ్‌కు వ్యాఖ్యాతగా వ్యవహరించిన రాబిన్ ఊతప్ప.. జియో హాట్‌స్టార్ లైవ్‌లో అంపైర్ల తీరును తప్పుబట్టాడు. 'అంపైర్ల నిర్ణయం నాకు ఆశ్చర్యానికి కలిగించింది. రాత్రిపూట పొగమంచు మరింత తీవ్రమవుతుంటే.. సమయం గడిచేకొద్దీ పరిస్థితి మెరుగుపడుతుందని వారు ఎలా అనుకుంటున్నారు? మనం మరో అరగంట వేచి ఉంటే ఏం జరుగుతుంది. పరిస్థితి మరింత కఠినంగా మారుతుంది. నేను ఇంతకంటే దారుణమైన పొగమంచు మధ్య ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాను. కానీ అంపైర్లు ఆటను ప్రారంభించకుండా సమయాన్ని వృథా చేయడం కోపం తెప్పిస్తుంది.'అని రాబిన్ ఊతప్ప తెలిపాడు. అంపైర్ల తీరు తనకు కూడా అర్థం కావడం లేదని సౌతాఫ్రికా దిగ్గజం డేల్ స్టెయిన్ అన్నాడు. 'అంపైర్లు ఏ నియమాన్ని పాటిస్తున్నారో నాకు తెలియదు. ఒక ఆటగాడిగా.. ఈ వాతావరణంలో ఆడటం పెద్ద కష్టమేం కాదనిపిస్తోంది. అంపైర్లలో ఒకరు వచ్చి మ్యాచ్ ఆలస్యానికి గల కారణాన్ని వివరిస్తే బాగుంటుంది.'అని డేల్ స్టెయిన్ అభిప్రాయపడ్డాడు. పొగమంచుతో పాటు మైదానం గాలి నాణ్యత దారుణంగా పడిపోవడంతో టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మాస్క్ ధరించి కనిపించాడు. కాసేపు మైదానంలో ప్రాక్టీస్ చేసిన భారత ఆటగాళ్లు ఆ తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌కు పరిమితమయ్యారు. రాత్రి 9.30 గంటలకు చివరిసారిగా మైదాన్ని పరిశీలించిన అంపైర్లు.. మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మ్యాచ్ రద్దవ్వడంపై ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీసీసీఐపై మండిపడుతున్నారు. పొగమంచు కురిసే ప్రదేశాల్లో మ్యాచ్‌లు ఎందుకని, సౌత్ ఇండియాలో చాలా మైదానాలు అనుకూలంగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు

## ధోనీకి ప్రత్యామ్నాయం విలువ 32 కోట్లు!

చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ.. ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పే సమయం ఆసన్నమైందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఐపీఎల్ 2026 మినీ వేలంలో చెన్నై సూపర్ కింగ్స్ వ్యవహరించిన తీరు ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్ కోసం ధోనీని సీఎస్‌కే రిటైన్ చేసుకున్నా.. అతను ఈ సీజన్ మధ్యలోనే వైదొలిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ సీజన్ మొత్తం ఆడినా.. అతను బ్యాటింగ్‌కే పరిమితం



అవుతాడని సీఎస్‌కే వర్గాలు పేర్కొన్నాయి. సీఎస్‌కేకు ఉన్న క్రేజ్ పడిపోవద్దనే ధోనీని జట్టులో కొనసాగిస్తున్నారనే అభిప్రాయం ఉంది. మరోవైపు చెన్నై సూపర్ కింగ్స్ కూడా ధోనీకి ప్రత్యామ్నాయ ఆటగాళ్లను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే సంజూ శాంసన్‌ను ట్రేడ్ చేసుకున్న సీఎస్‌కే అతని కోసం రవీంద్ర జడేజాతో పాటు సామ్ కరణ్‌ను కూడా వదులుకుంది. రూ.18 కోట్ల భారీ ధరతో జట్టులోకి తెచ్చుకుంది. ఇక వేలంలో అనామక వికెట్ కీపర్ కార్తీక్ శర్మపై కోట్లు కురిపించింది. ఇతర ఫ్రాంచైజీలతో తీవ్రంగా పోటీపడి 14.20 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. సంజూ శాంసన్‌తో పాటు కార్తీక్ శర్మ కోసమే సీఎస్‌కే రూ.32.20 కోట్లు ఖర్చు చేయడం గమనార్హం. ధోనీకి ప్రత్యామ్నాయ వికెట్ కీపర్‌ను తయారు చేయాలనే ఉద్దేశంతోనే సీఎస్‌కే ఇంతలా ఖర్చు పెట్టిందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శుక్రవారం 19-12-2025
www.evarthalu.com




## ఫిరాయింపుల క్రీడ

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు తీర్పును అపహాస్యం చేస్తూ సాగుతున్న 'పార్టీ ఫిరాయింపుల' పర్వం ఒక తీరని మచ్చగా మారుతోంది. ముఖ్యంగా తెలంగాణ రాజకీయాల్లో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు నైతిక విలువల పతనాన్ని కళ్లకు కడుతున్నాయి. ఒక గుర్తుపై గెలిచి, మరో పార్టీ కండువా కప్పుకుని, సాంకేతిక అంశాల సాకుతో "మేము పార్టీ మారలేదు" అని బుకాయించడం ఓటర్లను వంచించడమే. ప్రజలు ఒక పార్టీ సిద్ధాంతాలను, మేనిఫెస్టోను నమ్మి అభ్యర్థులను గెలిపిస్తారు. కానీ, గెలిచిన తర్వాత స్వార్థ ప్రయోజనాల కోసం లేదా అధికార పార్టీ ఇచ్చే ప్రలోభాలకు లోబడి గూడు మారడం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం. తెలంగాణలో పది మంది ఎమ్మెల్యేలు బహిరంగంగానే పార్టీ మారినట్లు కనిపిస్తున్నా, చట్టసభల్లో మాత్రం పాత పార్టీ సభ్యులుగానే చలామణి కావాలనుకోవడం రాజకీయ దిగజారుడుతనానికి పరాకాష్ట. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని లొసుగులను వాడుకుంటూ కాలయాపన చేయడం ఇప్పుడు ఒక ఆనవాయితీగా మారింది. స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జరిగే ఆలస్యం ఫిరాయింపుదారులకు రక్షణ కవచంగా మారుతోంది. 'కోర్టులు జోక్యం చేసుకోలేవు' అనే సాకుతో ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేయడం ఇక సాగకూడదు. ఈ విషయంలో న్యాయస్థానాలు ఇటీవల ఇస్తున్న తీర్పులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మార్పు రావాల్సి ఉంది. పార్టీ మారాలనుకునే వారు తమ పదవికి రాజీనామా చేసి, తిరిగి ప్రజా క్షేత్రంలోకి వెళ్లి గెలవడమే సరైన పద్ధతి. అలా కాకుండా పదవులను అంటిపెట్టుకుని పార్టీలు మారే వారికి చురుకు తగిలేలా నిబంధనలు ఉండాలి. పార్టీ మారినట్లు ఆధారాలు ఉన్నప్పుడు, నిర్ణీత కాలపరిమితిలోపు (గరిష్టంగా 3 నెలలు) స్పీకర్ చర్యలు తీసుకోవాలి. ఫిరాయించిన సభ్యులకు ఆ అసెంబ్లీ కాలపరిమితి ముగిసేవరకు ఎలాంటి మంత్రి పదవులు లేదా ప్రభుత్వ పదవులు దక్కకుండా చూడాలి. చట్టాలతో పాటు ప్రజల్లోనూ చైతన్యం రావాలి. ఫిరాయింపుదారులను సామాజికంగా నిలదీసినప్పుడే రాజకీయ నాయకుల్లో భయం పుడుతుంది. అధికార దాహం కోసం ప్రజాస్వామ్యాన్ని తాకట్టు పెట్టే ధోరణి ప్రజాస్వామ్య విలువలకు గొడ్డలి పెట్టు. గోడలు దూకే నాయకులకు చట్టపరంగా, నైతికంగా గట్టి గుణపాఠం చెబితేనే భవిష్యత్తులోనైనా విలువలతో కూడిన రాజకీయాలను చూడగలం.

*- ఈవార్తలు సంపాదకీయ విభాగం*



21వ శతాబ్దం ఆరంభం నుండి ప్రపంచ రాజకీయ యవనికపై భారత్ ఒక అనివార్య శక్తిగా ఎదుగుతోంది. 2025 నాటికి ప్రపంచ భౌగోళిక రాజకీయాలు అత్యంత సంక్లిష్టమైన మలుపు తిరిగాయి. ఒకప్పుడు అగ్రరాజ్యాల మధ్య సమతుల్యత కోసం ప్రయత్నించిన భారతదేశం, నేడు ప్రపంచ నిర్ణయాలను శాసించే 'విశ్వబంధు' స్థాయికి చేరుకుంది.

## భారత్ వ్యూహాత్మక ప్రాభవం

ఉక్రెయిన్-రష్యా యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, చైనా విస్తరణవాదం వంటి సవాళ్ల మధ్య భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానం ప్రపంచ దేశాలకు ఒక పాఠంగా మారింది. భారత విదేశాంగ విధానంలో అత్యంత కీలకమైన అంశం 'వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి'. ప్రపంచం రెండు ధ్రువాలుగా విడిపోతున్న తరుణంలో, భారత్ ఏ పక్షానికీ లొంగకుండా తన జాతీయ ప్రయోజనాలే పరమావధిగా ముందుకు సాగుతోంది. రష్యాతో దశాబ్దాల నాటి మైత్రిని కొనసాగిస్తూనే, అమెరికాతో రక్షణ, సాంకేతిక రంగాల్లో అత్యున్నత స్థాయి భాగస్వామ్యాన్ని నెలకొల్పుకోవడం భారత్ దౌత్య ప్రతిభకు నిదర్శనం. 2025లో కూడా రష్యా నుండి ముడి చమురు దిగుమతులు చేసుకుంటూనే, క్వాడ్ కూటమిలో క్రియాశీలక పాత్ర పోషించడం ద్వారా భారత్ తన స్వతంత్ర వైఖరిని చాటుకుంది. అమెరికా-భారత్ సంబంధాలు ఇప్పుడు కేవలం కొనుగోలుదారు-విక్రేత స్థాయిని దాటి, సహ-ఉత్పత్తి స్థాయికి చేరాయి. జెట్ ఇంజిన్ సాంకేతికత బదిలీ, అంతరిక్ష పరిశోధనల్లో సహకారం, సెమీకండక్టర్ల తయారీలో భాగస్వామ్యం వంటివి ఈ బంధాన్ని మరింత బలోపేతం చేశాయి. హిందూ-పసిఫిక్ ప్రాంతంలో చైనా ఆధిపత్యాన్ని అడ్డుకోవడంలో భారత్ ఒక 'నెట్ సెక్యూరిటీ ప్రొవైడర్'గా అమెరికా గుర్తిస్తోంది. భారత విదేశాంగ విధానంలో చైనా ఒక క్లిష్టమైన సవాలుగా




మిగిలిపోయింది. 2020 గాల్వాన్ లోయ ఉదంతం తర్వాత సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, భారత్ తన సైనిక పటిమను పెంచుకుంటూనే దౌత్యపరమైన చర్చలను కొనసాగిస్తోంది. చైనాపై ఆర్థికంగా ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు 'ఆత్మనిర్భర్ భారత్', 'పిఎల్ఐ' పథకాల ద్వారా దేశీయ ఉత్పాదకతను పెంచడం అంతర్జాతీయ సంబంధాల్లో భాగంగానే చూడాలి. 2023లో జీ-20 అధ్యక్ష బాధ్యతలను విజయవంతంగా నిర్వహించిన భారత్, అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుకగా నిలిచింది. ఆఫ్రికన్ యూనియన్‌ను జీ-20లో శాశ్వత సభ్యునిగా చేర్చడంలో భారత్ పోషించిన పాత్ర చారిత్రాత్మకం. వాతావరణ మార్పులు, అప్పుల ఊబిలో కూరుకుపోయిన చిన్న దేశాల సమస్యలు, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యాప్తిలో భారత్ ప్రపంచానికి మార్గదర్శిగా నిలుస్తోంది. మధ్యప్రాచ్య దేశాలతో (ముఖ్యంగా సౌదీ అరేబియా, యూఏఈ) భారత్ సంబంధాలు గత దశాబ్దంలో ఊహించని రీతిలో మెరుగుపడ్డాయి. 'ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్' వంటి ప్రతిపాదనలు కేవలం వాణిజ్యానికే పరిమితం కాకుండా, చైనా బెల్ట్ అండ్ రోడ్‌కు దీటైన ప్రత్యామ్నాయంగా మారుతున్నాయి. ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదంలో భారత్ సంతులన వైఖరిని ప్రదర్శిస్తూనే, ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండిస్తోంది. ప్రస్తుత అంతర్జాతీయ సంబంధాలు కేవలం భూభాగాలకే పరిమితం కాలేదు. సైబర్ భద్రత, కృత్రిమ మేధ నియంత్రణ, అంతరిక్షంలో ఆధిపత్యం వంటివి కొత్త దౌత్య వేదికలుగా మారాయి. భారత్ తన సాఫ్ట్‌వేర్ నైపుణ్యంతో ఈ రంగాల్లో అంతర్జాతీయ ప్రమాణాలను రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. భారతదేశం నేడు ఒక మధ్యవర్తిగానే కాకుండా, నియమ నిబద్ధత గల శక్తిగా ఎదుగుతోంది. వసుధైక కుటుంబం అనే నినాదంతో ప్రపంచ శాంతికి కట్టుబడి ఉంటూనే, తన జాతీయ భద్రత మరియు ఆర్థిక ప్రయోజనాల విషయంలో రాజీ పడకుండా సాగుతున్న తీరు అభినందనీయం. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వ త సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న పోరాటం కేవలం దేశ గౌరవం కోసమే కాదు, అది మారుతున్న ప్రపంచ వాస్తవికతకు గుర్తింపు. భారత దౌత్యం నేడు ఆదర్శవాదం, వాస్తవికవాదం మధ్య సమతుల్యతను సాధించింది. రాబోయే దశాబ్దాల్లో ఈ ప్రాభవం మరింత పెరిగి, ప్రపంచ శాంతి స్థాపనలో భారత్ ధ్రువతారగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.



రణధీర్ గుండు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత పాలన తీరుపై వస్తున్న విమర్శలు, ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేవలం ప్రసంగాలు, సమీక్షా సమావేశాలకు పరిమితం అవుతున్నారన్నది సత్యం. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరి దాదాపు ఒకటిన్నర ఏళ్లు గడుస్తోంది. 'రాష్ట్రాన్ని గాడిలో పెడతాం.. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం' అన్న నినాదాలతో బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇప్పుడు కేవలం సభలు, సమావేశాలు, సమీక్షలకే పరిమితం అవుతున్నారు. ఈ ప్రశ్న సామాన్యుడి నుంచీ వినిపిస్తోంది.




## సమీక్షలే.. అమలేది?

పాలనలో అనుభవం, విజన్ ఉన్న నాయకుడిగా పేరున్న బాబు, క్షేత్రస్థాయిలో ఫలితాలు చూపడంలో ఎందుకు వెనుకబడుతున్నారనేది ఇప్పుడు పెద్ద చర్చాంశం. అమరావతిలో జరిగే కలెక్టర్ల సదస్సులు, గంటల తరబడి సాగే సమీక్షా సమావేశాల్లో ముఖ్యమంత్రి ఇచ్చే దిశానిర్దేశాలు వినడానికి బాగుంటున్నాయి. 2047 నాటికి ఏపీని అగ్రస్థానంలో నిలుపుతామన్న లక్ష్యాలు, కృత్రిమ మేధ, డేటా డ్రివెన్ గవర్నెన్స్ వంటి భారీ పదజాలం సభలకు ఆకట్టుకుంటాయి. కానీ, సామాన్యుడికి కావాల్సింది అంకెల గారడీ కాదు, క్షేత్రస్థాయిలో కనిపించే మార్పు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులోనే స్వయంగా ముఖ్యమంత్రే 'ప్రజలు మన పనితీరును మెచ్చడం లేదు' అని వ్యాఖ్యానించడం గమనార్హం. దాదాపు 49 శాతం మంది ప్రజలు అసంతృప్తితో ఉన్నారని ఆయన అంగీకరించడం పాలనలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతోంది. గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ కాలం గడపడం కంటే, ప్రస్తుత సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రోడ్ల మరమ్మతులు, తాగునీటి సమస్యలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటివి ఇంకా ప్రకటనల స్థాయిలోనే ఉన్నాయి. అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిలో జరుగుతున్నట్లు కనిపించడం లేదని, ఎమ్మెల్యేల పనితీరుపై కూడా ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని పలు నివేదికలు చెబుతున్నాయి. 37 మంది ఎమ్మెల్యేల పనితీరు ఆశాజనకంగా లేదని స్వయంగా ముఖ్యమంత్రే హెచ్చరించడం క్షేత్రస్థాయిలో పాలన ఏ విధంగా ఉందో ప్రతిబింబిస్తోంది. పెట్టుబడుల వేటలో విదేశీ సంస్థలతో ఒప్పందాలు, పారిశ్రామిక సదస్సులు నిర్వహించడం శుభపరిణామమే. అయితే, ఈ ఒప్పందాలు క్షేత్రస్థాయిలో ఉద్యోగాలుగా మారడానికి ఎంత సమయం పడుతుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సమీక్షల్లో చెబుతున్నా, పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. కేవలం హంగులు, ఆర్భాటాలకే ప్రాధాన్యతనిచ్చి, ప్రజల ప్రాథమిక అవసరాలను విస్మరిస్తే ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవు. పాలన అంటే కేవలం కార్పొరేట్ తరహా ప్రసంగాలు, అంకెల ప్రదర్శన కాదు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు సామాన్యుడి గడప వరకు చేరినప్పుడే అది నిజమైన అభివృద్ధి అనిపించుకుంటుంది. ఇప్పటికైనా చంద్రబాబు సమీక్షా భవనాల నుంచి బయటకు వచ్చి, క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకోవాలి. అధికారులు, ఎమ్మెల్యేల నుంచి జవాబుదారీతనం కోరుతూనే, పాలనలో వేగం పెంచకపోతే అనుభవం అనే మాటకు విలువ ఉండదు.

- వెన్నెల సూర్యప్రకాశ్ చౌదరి,
గుంటూరు

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.